www.akshratimes.com

తెలుగు దినపత్రిక

# అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

PRGI.NO : APTEL /26/A4786

సంపుటి : 01 సంచిక : 41 పేజిలు : 08, వెల రూ. 1 రూ/ మంగళవారం 21 - 07 - 2026

Published by EAST GODAVARI : Circulated by: East Godavari, Polavaram, Kakinada






జపాన్ కొత్త టెక్నాలజీ.. మనుషులను చల్లబరిచే ప్రత్యేక ఫ్రిజ్!


## పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల తరహాలో

# రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే లాభాలను ప్రజలకు చెప్పాలి
- ఆర్టీజీఎస్‌లో వివిధ శాఖలపై సీఎం చంద్రబాబు సమీక్ష
- సబ్-రిజిస్ట్రార్ ఆఫీసుల ప్రైవేటీకరణ వార్తలు అవాస్తవమన్న చంద్రబాబు
- పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల మాదిరిగా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు అని వివరణ
- దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని అధికారులకు సీఎం ఆదేశం




**అమరావతి :** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారంటూ కొందరు పని గట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని దీనిపై వాస్తవాలను ప్రజలకు తెలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. రిజిస్ట్రేషన్ సేవలను మరింత సులభతరం చేసేలా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు.రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్లో వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారనే అంశం సమీక్షలో ప్రస్తావనకు వచ్చింది. ఇది ప్రైవేటీకరణ ఎంత మాత్రమూ కాదని స్పష్టంచేశారు. పాస్ పోర్టు సేవా కేంద్రాల తరహాలోనే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు పని చేస్తాయని తెలిపారు. పాస్ పోర్టు సేవా కేంద్రాల పనితీరు ఏ విధంగా జరుగుతుందో, ఆ తర్వాత ప్రక్రియ ఏ విధంగా జరుగుతుందో వివరించాలని సూచించారు.పాస్ పోర్టు సేవా కేంద్రాలు అందుబాటులోకి వచ్చాక పాస్ పోర్టు ప్రాసెసింగ్ అనేది చాలా సులువైందన్న సీఎం, ఇదే తరహాలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల పనితీరు ఉంటుందని తెలిపారు. అయితే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల విషయంలో కొందరు పనిగట్టుకుని - మిగతా 2 లో

## తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు

# కొత్త రూపు




- నూతన వాహనాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా 500 నూతన వాహనాలతో సేవలు అందించనున్న ప్రభుత్వం
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలకు ఉచిత, సురక్షిత రవాణా
- జీపీఎస్, ఏసీ, సీట్ బెల్టుల వంటి ఆధునిక సౌకర్యాలతో వాహనాల రూపకల్పన
- ఏటా సుమారు 2.75 లక్షల మంది బాలింతలకు ప్రయోజనం చేకూరనున్న అంచనా




## విద్యార్థులు చదువుకే పరిమితం కాకూడదు

- మంచి సంస్కారం అలవర్చుకోవాలి
- రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత
- విజయనగరంలో ఘనంగా 'షైనింగ్ స్టార్స్' అవార్డుల ప్రదానోత్సవం
- ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత
- ప్రతిభావంతులైన 223 మంది విద్యార్థులకు సత్కారం

**అమరావతి :** "రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో ఎన్నో సానుకూల మార్పులు వస్తున్నాయి" అని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. విజయనగరంలో 'షైనింగ్ స్టార్స్' అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆమె ఘనంగా సత్కరించి అభినందించారు. - మిగతా 2 లో

## రాహుల్ వయసుపై ప్రధాని మోదీ చురకలు



- ప్రైవేట్ రాకెట్ ప్రయోగించిన యువతను ప్రశంసించిన ప్రధాని మోదీ
- రాహుల్ గాంధీ వయసును ఉద్దేశించి పరోక్షంగా సెటైర్లు
- స్కైరూట్ బృందం సగటు వయసు 28 అని వెల్లడి
- తాను మాట్లాడుతోంది 56 ఏళ్ల యువకుడి గురించి కాదన్న ప్రధాని

**ఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. భారత్‌లో తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన హైదరాబాద్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్'ను అభినందిస్తూనే, రాహుల్ గాంధీ వయసును ఉద్దేశించి ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.సోమవారం పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మీడియాతో మాట్లాడిన ప్రధాని, దేశం సాధించిన ఇటీవలి విజయాలను ప్రస్తావించారు. "భారత్ నుంచి తొలి ప్రైవేట్ రాకెట్‌ను ప్రయోగించిన స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు కేవలం 28 ఏళ్లేనని నాకు తెలిసింది. ఇంతటి అతి పిన్న వయస్కులు ఈ ఘనతను సాధించారు. నేను ఇక్కడ 56 ఏళ్ల 'యువకుడి' గురించి - మిగతా 2 లో

## పాకిస్థాన్‌ను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం

- కోరలు చాస్తున్న పేదరికం
- పాకిస్థాన్‌లో ప్రమాదకర స్థాయికి చేరిన పేదరికం
- పట్టణాలతో పోలిస్తే గ్రామాల్లోనే ఎక్కువ ప్రభావం
- అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభాలే ప్రధాన కారణాలు
- వృద్ధి ఫలాలు సంపన్నులకే.. పేదలకు తప్పని కష్టాలు





**ఢిల్లీ :** దాయాది దేశం పాకిస్థాన్‌ను పేదరికం చుట్టుముడుతోంది. గడిచిన ఆరేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదొడుకులకు లోనుకావడంతో నిరుపేదల సంఖ్య ప్రమాదకర స్థాయిలో పెరిగిపోయింది. వరుస ఆర్థిక సంక్షోభాలు, అధిక ద్రవ్యోల్బణం, బలహీనమైన వృద్ధి రేటు వంటి కారణాలతో కుటుంబ ఆదాయాలు గణనీయంగా క్షీణించాయి. ఫలితంగా దేశ - మిగతా 2 లో

## కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ నాయకుల భేటీ

- నీట్ వివాదంపై కేంద్రమంత్రి నడ్డాతో భేటీ
- విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్
- ఢిల్లీలో 'చలో సంసద్' ర్యాలీ... నిరసనకారులపై లాఠీఛార్జ్
- డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టీకరణ



**ఢిల్లీ :** నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీకేజీతో పాటు పలు పరీక్షల్లో జరిగిన అవకతవకలపై ఆరోపణలు వెల్లువెత్తడంతో ఢిల్లీలో నిరసనలు ఉద్ధృతమయ్యాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సోమవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో భేటీ అయ్యారు.సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశు తోష్ రంకా ఢిల్లీలోని నడ్డా నివాసంలో సుమారు 10 నిమిషాల పాటు సమావేశమై, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సమస్యపై అంతర్గతంగా ఉన్నత స్థాయిలో చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చారని, అయితే ఎటువంటి నిర్దిష్ట హామీలు లభించలేదని సౌరవ్ దాస్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం రోజే సీజేపీ - మిగతా 2 లో




## డెంగీపై భారత్‌కు తొలి వ్యాక్సిన్

- 'క్యూడెంగా'కు ఆమోదం!
- భారత్‌లో తొలి డెంగీ వ్యాక్సిన్‌కు ఆమోదం
- నాలుగు రకాల డెంగీ వైరస్‌ల నుంచి రక్షణ
- ప్రయోగాల్లో ఆస్పత్రి చేరికలను 84 శాతం తగ్గించిన వైనం

**ఢిల్లీ :** వర్షాకాలం మొదలైతే డెంగీ భయం వెంటాడటం మనకు కొత్త కాదు. ఏటా వేలాది మంది ఆసుపత్రుల పాలవుతుంటారు. అలాంటి డెంగీ నియంత్రణలో భారత్ కీలక ముందడుగు వేసింది. దేశంలో తొలి డెంగీ - మిగతా 2 లో




## తెలంగాణలో క్యూఆర్ కోడ్‌తో కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు

- 3 నెలల బియ్యం ఒకేసారి పంపిణీ
- క్యూఆర్ కోడ్‌తో పటిష్ఠ భద్రతా ఫీచర్లతో కొత్త కార్డుల రూపకల్పన
- ఆగస్టు నుంచి మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ
- రేషన్ సరుకులకు జులై 31 లోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవడం తప్పనిసరి

**హైదరాబాద్ :** తెలంగాణలో అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం వినియోగిస్తున్న కాగితపు కార్డుల స్థానంలో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ప్లాస్టిక్ - మిగతా 2 లో

## తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉంది



- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలి
- ఎల్‌నినో ప్రభావంపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ప్రభుత్వం
- తెలంగాణ రాష్ట్రంలోనే ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందన్న మంత్రి ఉత్తమ్ కుమార్

**హైదరాబాద్ :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినోను - మిగతా 2 లో

## కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

- ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్
- ఢిల్లీలో నీట్ విద్యార్థుల ఆందోళనపై పోలీసుల లాఠీఛార్జ్
- కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి
- ప్రశ్నిస్తున్న యువతపై దాడులు బీజేపీ భయానికి నిదర్శనమన్న సీఎం
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్
- విద్యార్థులకు అండగా ఉంటానని స్పష్టం చేసిన రేవంత్



**హైదరాబాద్ :** నీట్-యూజీ 2026 పరీక్ష నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై దేశ రాజధాని ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల చర్యను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న వారిపై లాఠీఛార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో విద్యార్థులకు ఆయన తన పూర్తి మద్దతు ప్రకటించారు.సోషల్ మీడియా వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి, విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు వారి గొంతు నొక్కేందుకు పోలీసు బలగాలను ప్రయోగిస్తోందని ఆరోపించారు."నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పడిన ప్రతి దెబ్బ.. ప్రశ్నలన్నా, నిజమన్నా బీజేపీకి ఉన్న భయాన్ని బహిర్గతం చేస్తోంది. నీట్ కుంభకోణంపై కేంద్రం ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలి. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు నేను - మిగతా 2 లో

# సంపాదకీయం

## విక్రమ్-1తో అంతరిక్ష రంగంలో నూతన శకం

(సి.హెచ్.ప్రతాప్)



భారత అంతరిక్ష రంగం మరో చారిత్రక మైలురాయిని చేరుకుంది. ఇటీవల భారతీయ ప్రైవేటు సంస్థ అభివృద్ధి చేసిన విక్రమ్-1 రాకెట్ విజయవంతంగా కక్ష్యలోకి చేరడం దేశ అంతరిక్ష చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికింది. ఈ విజయం కేవలం ఒక సంస్థ సాధించిన ఘనత మాత్రమే కాదు; ప్రభుత్వ సంస్థల అనుభవం, శాస్త్రవేత్తల మార్గదర్శకత్వం, యువ పారిశ్రామికవేత్తల సృజనాత్మకత కలిసినప్పుడు భారతదేశం ఎంతటి విజయాలను అందుకోగలదో ప్రపంచానికి చాటిచెప్పింది. హైదరాబాద్ కేంద్రంగా 2018లో స్థాపించబడిన స్కైరూట్ ఏరోస్పేస్ భారత తొలి ప్రైవేటు అంతరిక్ష ప్రయోగ సంస్థగా గుర్తింపు పొందింది. ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా స్థాపించిన ఈ సంస్థ, స్వదేశీ సాంకేతికతతో చిన్న ఉపగ్రహాల ప్రయోగాలకు అనువైన రాకెట్లను అభివృద్ధి చేస్తోంది. విక్రమ్-1 విజయవంతమైన ప్రయోగంతో భారత ప్రైవేటు అంతరిక్ష రంగ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటుతూ, అంతర్జాతీయ వాణిజ్య అంతరిక్ష సేవల్లో దేశానికి కొత్త అవకాశాల ద్వారాలు తెరిచింది. అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం వల్ల ఎన్నో సానుకూల ఫలితాలు కనిపిస్తున్నాయి. వినూత్న సాంకేతికతల అభివృద్ధి వేగవంతమవుతోంది. పరిశోధనలో కొత్త ఆలోచనలు ఆచరణలోకి వస్తున్నాయి. ఉపగ్రహాల రూపకల్పన, ప్రయోగ వాహనాల తయారీ, భూ పరిశీలన, కమ్యూనికేషన్ సేవలు వంటి విభాగాల్లో దేశీయ సంస్థలు ప్రపంచ మార్కెట్‌లో పోటీ పడే సామర్థ్యాన్ని పెంపొందించుకుంటున్నాయి. దీంతో యువ ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, స్టార్టప్‌లకు విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి. ఉపాధి సృష్టితో పాటు విదేశీ పెట్టుబడులు, వాణిజ్య ప్రయోగాల ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికీ ఇది తోడ్పడుతుంది. అయితే ప్రతి అవకాశంతో పాటు కొన్ని బాధ్యతలు కూడా వస్తాయి. అంతరిక్ష రంగం అత్యంత సున్నితమైన, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముడిపడి ఉంటుంది. కాబట్టి భద్రతా ప్రమాణాలు, నాణ్యత నియంత్రణ, పరిశోధనలో పారదర్శకత, అంతర్జాతీయ నిబంధనల పాటింపు వంటి అంశాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రైవేటు సంస్థలు తక్షణ వాణిజ్య ప్రయోజనాలతో పాటు దేశ దీర్ఘకాల శాస్త్రీయ లక్ష్యాలను కూడా దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాలి. ప్రభుత్వం, ఇస్రో, పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సమన్వయం మరింత బలపడితే ఈ రంగం మరింత స్థిరంగా ఎదుగుతుంది. భవిష్యత్తులో అంతరిక్ష సాంకేతికత వ్యవసాయం, వాతావరణ అంచనాలు, విపత్తు నిర్వహణ, టెలిమెడిసిన్, విద్య, రక్షణ, కమ్యూనికేషన్ వంటి అనేక రంగాలకు మరింత ఉపయోగపడనుంది. ఈ నేపథ్యంలో ప్రైవేటు భాగస్వామ్యం పరిశోధనను వేగవంతం చేయడమే కాకుండా భారతదేశాన్ని ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో ప్రముఖ స్థానానికి చేర్చగల శక్తిని కలిగి ఉంది. భారతీయ స్టార్టప్‌లకు అంతర్జాతీయ భాగస్వామ్యాలు, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, నూతన పెట్టుబడుల అవకాశాలు కూడా మరింత విస్తరిస్తాయి. దీని ద్వారా దేశీయ తయారీ రంగానికి ఊతమిచ్చే బలమైన అంతరిక్ష పారిశ్రామిక వ్యవస్థ ఏర్పడే అవకాశం ఉంది. విక్రమ్-1 విజయం భారత యువతలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ప్రభుత్వ విధానాల ప్రోత్సాహం, ఇస్రో సాంకేతిక వారసత్వం, ప్రైవేటు సంస్థల సృజనాత్మకత కలిసి పనిచేస్తే భారత అంతరిక్ష రంగం మరిన్ని శిఖరాలను అధిరోహించడం ఖాయం. ప్రపంచ అంతరిక్ష రంగంలో వేగంగా మారుతున్న పోటీ పరిస్థితుల్లో నాణ్యత, భద్రత, పరిశోధన, నవకల్పనలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగితే భారతదేశం వాణిజ్య అంతరిక్ష సేవలలోనూ అగ్రగామిగా నిలిచే అవకాశాలు మరింత పెరుగుతాయి. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం పరస్పర విశ్వాసం, సాంకేతిక నైపుణ్యం, జాతీయ ప్రయోజనాల సమన్వయంతో ముందుకు సాగినప్పుడే "అంతరిక్ష శక్తిగా భారత్" అనే లక్ష్యం మరింత వేగంగా సాకారమవుతుంది.

## రాహుల్ వయసుపై ప్రధాని మోదీ చురకలు

**మొదటిపేజీ తరువాయి -** మాట్లాడటం లేదు... రోదసిలో త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన 28 ఏళ్ల యువత గురించి మాట్లాడుతున్నాను" అని మోదీ పేర్కొన్నారు. జూన్ మాసంలో 56వ ఏట అడుగుపెట్టిన రాహుల్ గాంధీని ఉద్దేశించే ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమవుతోంది. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ శనివారం 'విక్రమ్-1' రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఈ ప్రయోగం ద్వారా అమెరికా, చైనాల తర్వాత ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాలను కలిగిన మూడో దేశంగా భారత్ రికార్డు సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా కేవలం కొన్ని దేశాలకు మాత్రమే పరిమితమైన ఈ ఘనతను భారత యువత సాధించడం దేశానికే గర్వకారణమని మోదీ కొనియాడారు. గత ఏడాది వర్షాకాల సమావేశాల కంటే ముందు ఓ భారత పౌరుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న అంశాన్ని కూడా ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పార్లమెంట్ సమావేశాలు అర్థవంతంగా, ఫలప్రదంగా సాగాలని, ప్రజా సమస్యలపై లోతైన చర్చలు జరగాలని ఆయన ఆకాంక్షించారు.

## కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ నాయకుల భేటీ

**మొదటిపేజీ తరువాయి -** 'పార్లమెంట్ ముట్టడి'కి పిలుపునివ్వడంతో జంతర్ మంతర్ వద్దకు విద్యార్థులు, యువత భారీగా చేరుకున్నారు. అక్కడి నుంచి పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నప్పటికీ ముందుకు వెళ్లేందుకు యత్నించిన ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు కొన్నిచోట్ల లాఠీఛార్జ్ చేయడంతో పాటు బాష్పవాయువును ప్రయోగించారు. సోషల్ మీడియాలో ఒక వ్యంగ్య ఉద్యమంగా ఆరంభమైన కాక్రోచ్ జనతా పార్టీ, ప్రస్తుతం పరీక్షల లీకేజీలు, సాంకేతిక వైఫల్యాలపై నిరంతరాయంగా పోరాడుతోంది. ఈ ఉద్యమానికి మద్దతుగా పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ సుదీర్ఘ నిరాహార దీక్ష చేపట్టారు. ఆందోళనలు ప్రారంభమైన తర్వాత సీజేపీ నేతలతో కేంద్ర ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చలు జరపడం ఇదే ప్రథమం. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత నిరసనలు కొనసాగిస్తామని సీజేపీ నాయకత్వం తేల్చిచెప్పింది.

## పాకిస్థాన్‌ను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం

**మొదటిపేజీ తరువాయి -** జనాభాలో దాదాపు 29 శాతం మంది పేదరిక రేఖకు దిగువన జీవిస్తున్నారని ఒక తాజా నివేదిక వెల్లడించింది. 2018-19లో 21.8 శాతంగా ఉన్న పేదరికం, 2024-25 నాటికి 28.9 శాతానికి చేరింది. అంటే కేవలం ఆరేళ్లలోనే పేదరికం 7 శాతం పెరిగింది. హౌస్‌హోల్డ్ ఇంటిగ్రేటెడ్ ఎకనామిక్ సర్వే (హెచ్‌ఐఈఎస్), పాకిస్థాన్ సోషల్ అండ్ లివింగ్ స్టాండర్డ్స్ మెజర్‌మెంట్ (పీఎస్ఎల్ఎం) డేటా ఆధారంగా 'డాన్' పత్రిక ఈ విశ్లేషణను ప్రచురించింది. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత విడుదలైన ఈ గణాంకాలు.. దేశం ఎదుర్కొన్న బహుళ సంక్షోభాల ప్రభావాన్ని స్పష్టం చేస్తున్నాయి. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాలపై ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉంది. గ్రామీణ పాకిస్థాన్‌లో పేదరికం సుమారు 8 శాతం మేర పెరగగా, పట్టణ ప్రాంతాల్లో ఇది 6 శాతంగా నమోదైంది. పదేపదే తలెత్తిన చెల్లింపుల సంక్షోభం, కోవిడ్-19 మహమ్మారి, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, దీర్ఘకాలిక స్థూల ఆర్థిక సర్దుబాట్లు వంటివి ఈ దుస్థితికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. విశ్లేషకులు ఈ పరిస్థితిని జీవన ప్రమాణాల మెరుగుదల విషయంలో 'కోల్పోయిన దశాబ్దం'గా అభివర్ణిస్తున్నారు. గత రెండు సర్వేల మధ్య కాలంలో ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేసిన తర్వాత చూస్తే, సగటు కుటుంబ ఆదాయాలు, వినియోగం గణనీయంగా తగ్గినట్లు నివేదిక పేర్కొంది. ఆర్థిక వృద్ధి సానుకూలంగా ఉన్నప్పటికీ, పేదరికం పెరగడం ఆందోళన కలిగించే అంశం. ఈ వృద్ధి ఫలాలు ఎక్కువగా ఉన్నత ఆదాయ వర్గాలకే చేరాయని, దిగువ ఆదాయ వర్గాల వాస్తవ ఆదాయాలు, కొనుగోలు శక్తి తీవ్రంగా దెబ్బతిన్నాయని ఇది సూచిస్తోంది. పేద కుటుంబాలు ఎక్కువగా రోజువారీ వేతనాలపై ఆధారపడతాయి. అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక అంతరాయాల వల్ల ఈ వర్గాలే ఎక్కువగా నష్టపోయాయి. మరోవైపు, సంపన్న వర్గాలు రియల్ ఎస్టేట్, ఆర్థిక పెట్టుబడుల వంటి ఆస్తులను కలిగి ఉండటంతో, ధరల పెరుగుదల ప్రభావాన్ని తట్టుకోగలిగారు. దీంతో దేశంలో ఆదాయ అసమానతలు మరింత పెరిగాయి. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, బాహ్య ఆర్థికపరమైన రిస్కుల మధ్య, పెరుగుతున్న పేదరికాన్ని, విస్తరిస్తున్న అసమానతలను పరిష్కరిస్తూనే ఆర్థిక వృద్ధిని కొనసాగించడం పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థకు పెను సవాలుగా మారింది.

## కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

**మొదటిపేజీ తరువాయి -** ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజైన సోమవారం, కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు 'ఛలో పార్లమెంట్' కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో సమూల సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ వారు పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి.

## పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల తరహాలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు



**మొదటిపేజీ తరువాయి -** దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రజలకు వాస్తవాలు వివరించే బాధ్యతను అధికారులు తీసుకోవాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే లాభాలను వివరించాలన్నారు. డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఇబ్బంది లేని విధంగా మార్గాలు చూపెడతామని హామీ ఇచ్చారు. దీపం-2.0 పథక లబ్దిదారులకు ఇచ్చే సబ్సిడీని క్రమపద్ధతిలో ఇవ్వాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. ఈ సబ్సిడీని నిర్ధారిత తేదీల్లో ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఈ అంశంపై పౌర సరఫరాల శాఖ-ఆర్థిక శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. దీనికి సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలించి అమలు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. లిటిగెంట్ పిటిషనర్లను ఏ విధంగా కట్టడి చేయాలి, ఎలాంటి ప్రజా ప్రయోజనం లేకుండా చేసే ఫిర్యాదు దారులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని సీఎం చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా 81 మంది లిటిగెంట్ పిటిషనర్లు ఉన్నట్టు గుర్తించామన్నారు. వీరు సరాసరి ఒక్కొక్కరు 246 పిటిషన్లు పెడుతున్నారన్నారు. వీరి వివరాలను జిల్లా కలెక్టర్లకు పంపించాలని సూచించారు. వారు పెట్టే అర్జీల్లో ప్రజా ప్రయోజనాలు ఉంటే వాటిని పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వాన్ని, అధికారులను బద్నాం చేసే ఉద్దేశంతో పిటిషన్లు పెట్టే వారిని గుర్తించాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఆర్థికేతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రాధాన్యతల వారీగా ఆర్థిక సమస్యలను పరిష్కరిద్దామన్నారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా ప్రస్తుతం 49 శాతం లోటు వర్షపాతం ఉంది. ఈ ప్రభావం నుంచి బయటపడేసే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలన్నారు. ఈ మేరకు రైతుల్లో అవగాహన కల్పించాలని, డ్రై క్రాప్స్ వేసేలా రైతులను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. వీబీ జీ రామ్ జీ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. జలధార పనులకు వీబీ జీ రామ్ జీ పనుల్ని అనుసంధానం చేయాలన్నారు. ప్రజాభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పని విధానం మార్చుకోవాలని, పరిపాలనా విధానాలను మెరుగుపరుచుకోవాలన్నారు. సమస్యలు ఉత్పన్నమయ్యాక చర్యలు తీసుకోవడంతోపాటు ముందుగానే ఏయే సమస్యలు వస్తాయనే విషయాన్ని అంచనా వేసి దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

## తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు కొత్త రూపు

**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్రంలో మాతా-శిశు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం, 'తల్లీ--బిడ్డ ఎక్స్‌ప్రెస్' సేవలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా, గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు సురక్షితమైన, నాణ్యమైన రవాణా సౌకర్యం కల్పించేందుకు సిద్ధం చేసిన 500 నూతన వాహనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాల రూపకల్పన, భద్రతా ప్రమాణాలు, ప్రయాణికులకు కల్పించిన సౌకర్యాలను సీఎం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా తల్లీబిడ్డల అవసరాలకు అనుగుణంగా వాహనాల్లో చేసిన మార్పులను అధికారులు ఆయనకు వివరించారు. ఈ సేవలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించేలా వాహనాలపై రూపొందించిన బ్రాండింగ్ నమూనాలను పరిశీలించి, వాటికి ఆమోదం తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలను, వారి నవజాత శిశువులను, సహాయకులను ఉచితంగా, క్షేమంగా వారి ఇళ్లకు చేర్చడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. దీంతో పాటు, అధిక రక్తహీనతతో బాధపడే గర్భిణులు, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న గర్భిణులను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రులకు తీసుకురావడానికి కూడా ఈ వాహనాలను వినియోగించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 500 వాహనాల ద్వారా అందించే ఈ సేవలతో ఏటా సుమారు 2.75 లక్షల మంది బాలింతలు లబ్ధి పొందనున్నారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ కొత్త వాహనాల్లో ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు పెద్దపీట వేశారు. వెనుక సీట్లలో సైతం సీటు బెల్టులు, బాలింతలు సులభంగా ఎక్కి దిగేందుకు వీలుగా ఫుట్‌రెస్ట్, ఎయిర్ కండిషనింగ్ (ఏసీ), ఫస్ట్ ఎయిడ్ కిట్, అగ్నిమాపక పరికరాలు వంటివి ఏర్పాటు చేశారు. ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను అనుసంధానించడం ద్వారా వాటి కదలికలను రియల్ టైమ్‌లో పర్యవేక్షించనున్నారు. వాహనాలపై అధికారిక స్టిక్కరింగ్ పూర్తి చేసి, త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి వీరపాండ్యన్, జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుకే పరిమితం కాకూడదు

**మొదటిపేజీ తరువాయి -** కూటమి ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం అనేక చర్యలు చేపడుతోంది. ప్రతిభావంతులను ప్రోత్సహించాలనే సత్సంకల్పంతో అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా గత రెండేళ్లుగా 'షైనింగ్ స్టార్స్' పేరుతో అవార్డులను ప్రదానం చేస్తోంది. ఈ కార్యక్రమంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 184 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. అలాగే ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మరో 39 మంది విద్యార్థులను గుర్తించారు. వీరందరికీ మంత్రి అనిత చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. ప్రతి విద్యార్థికి ఒక మెడల్, మెరిట్ సర్టిఫికెట్ ఇచ్చారు. వీటితో పాటు ప్రోత్సాహకంగా రూ.20 వేల నగదును బహుకరించారు. ఈ సందర్భంగా మంత్రి వంగలపూడి అనిత విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. విజయనగరం అంటేనే విజ్ఞాన నగరమని ఆమె కీర్తించారు. ఈ గడ్డ ఎన్నో అద్భుత చరిత్రలను సృష్టించిందని గుర్తుచేశారు. విద్యార్థులు ఇక్కడి నుంచి స్ఫూర్తి పొందాలన్నారు. ప్రతి ఒక్కరూ భవిష్యత్తుపై ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. సమయాన్ని ఏమాత్రం వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. విలువలతో కూడిన విద్యను అభ్యసించడం ఎంతో అవసరమని చెప్పారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకూడదన్నారు. చదువుతో పాటు మంచి సంస్కారం కూడా అలవర్చుకోవాలని హితవు పలికారు. తల్లిదండ్రుల కష్టాన్ని పిల్లలు ఎప్పటికీ మర్చిపోకూడదని మంత్రి కోరారు. ఎన్నో త్యాగాలు చేసి వారు తమ పిల్లలను చదివిస్తున్నారని గుర్తుచేశారు. వారి కష్టాన్ని వృథా చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత విద్యార్థులదే అన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అప్పుడే తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు వస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్ణయాలను ఆమె కొనియాడారు. విద్యారంగంలో ఆయన ఎన్నో మార్పులు తీసుకువస్తున్నారని చెప్పారు. విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి పైనా మంత్రి అనిత కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో ఉత్తరాంధ్రలో భారీగా పరిశ్రమలు రాబోతున్నాయని వెల్లడించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో పలువురు ప్రము ఖులు పాల్గొన్నారు. విజయనగరం జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు అదితి విజయలక్ష్మి గజపతిరాజు, లోకం మాధవి హాజరయ్యారు. వీరితో పాటు మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగారు రాజు, డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ, తూర్పు కాపు అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి తదితరులు పాల్గొన్నారు. "విజయనగరం అంటేనే ఒక విజ్ఞాన నగరం. ఈ గడ్డ ఎన్నో చరిత్రలు సృష్టించిన గడ్డ. నేటి విద్యార్థులు ఇక్కడి నుంచి ఎంతో స్ఫూర్తి పొందాలి. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యారంగంలో ఎన్నో అద్భుతమైన మార్పులు తీసుకువస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నాం. ఉత్తరాంధ్రలో పెద్ద సంఖ్యలో పరిశ్రమలు కూడా రాబోతున్నాయి. విద్యార్థులు తమ సమయాన్ని వృథా చేసుకోకుండా సద్వినియోగం చేసుకోవాలి.

## డెంగీపై భారత్‌కు తొలి వ్యాక్సిన్

**మొదటిపేజీ తరువాయి -** వ్యాక్సిన్‌గా జపాన్‌కు చెందిన టకెడా కంపెనీ రూపొందించిన 'క్యూడెంగా'కు 'కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) ఆమోదం తెలిపింది. దీంతో డెంగీ నివారణలో భారత్‌కు మరో కీలక ఆయుధం అందుబాటులోకి రానుంది. భారత్‌లో గత రెండు దశాబ్దాలుగా డెంగీ కేసులు వేగంగా పెరుగు తున్నాయి. పట్టణీకరణ, వాతావరణ మార్పులు, దోమల వ్యాప్తికి అనుకూల పరిస్థితులు, జనాభా పెరుగుదల ఇందుకు ప్రధాన కారణాలుగా నిపుణులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న డెంగీ కేసుల్లో దాదాపు మూడో వంతు భారత్‌లోనే ఉంటాయని అంచనా. ముఖ్యంగా వర్షాకాలం, ఆ తర్వాతి నెలల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. క్యూడెంగా (టీఏకే-003)ను జపాన్‌కు చెందిన ఔషధ సంస్థ టకెడా అభివృద్ధి చేసింది. ఇది లైవ్ అటెన్యుయేటెడ్ టెట్రావాలెంట్ వ్యాక్సిన్. అంటే డెంగీ వైరస్‌లోని నాలుగు రకాలైన డెన్‌వీ-1, డెన్‌వీ-2, డెన్‌వీ-3, డెన్‌వీ-4పై రోగనిరోధక శక్తిని పెంచేలా రూపొందించారు. ఈ వ్యాక్సిన్‌ను మూడు నెలల వ్యవధిలో రెండు డోసులుగా ఇస్తారు. చర్మం కింద ఇంజెక్షన్ రూపంలో వేస్తారు. డెంగీ అధికంగా ఉన్న దేశాల్లో సమగ్ర నియంత్రణ వ్యూహంలో భాగంగా దీన్ని వినియోగించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఇప్పటికే సూచించింది. ఈ వ్యాక్సిన్‌కు మరో ప్రత్యేకత కూడా ఉంది. గతంలో అందుబాటులో ఉన్న డెంగ్‌వాక్సియా వ్యాక్సిన్ తీసుకునే ముందు వ్యక్తికి ఇప్పటికే డెంగీ సోకిందో లేదో రక్త పరీక్ష చేయాల్సి వచ్చేది. అలాంటి అవసరం క్యూడెంగాకు లేదు. డెంగీ వచ్చినా, రాకపోయినా ఈ వ్యాక్సిన్ ఇవ్వొచ్చు. దీంతో సామూహిక టీకా కార్యక్రమాలను సులభంగా నిర్వహించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం యూరోపియన్ యూనియన్, బ్రిటన్, బ్రెజిల్, ఇండోనేషియా, అర్జెంటీనా సహా 40కిపైగా దేశాల్లో ఈ వ్యాక్సిన్‌కు అనుమతులు లభించాయి. ఇప్పుడు ఆ జాబితాలో భారత్ కూడా చేరింది. క్యూడెంగా ప్రభావంపై నిర్వహించిన టైడ్స్ ఫేజ్-3 క్లినికల్ అధ్యయనంలో 20 వేల మందికిపైగా పిల్లలు, యువత పాల్గొన్నారు. సుమారు నాలుగున్నరేళ్ల పరిశీలనలో ఆసుపత్రిలో చేరే పరిస్థితిని 84 శాతం వరకు తగ్గించినట్లు గుర్తించారు. ప్రయోగశాల పరీక్షల్లో నిర్ధారిత డెంగీ కేసులపై దాదాపు 61 శాతం రక్షణ కల్పించినట్లు వెల్లడైంది. గతంలో సోకిన వారికైనా, సోకని వారికైనా తీవ్రమైన డెంగీ ప్రమాదాన్ని తగ్గించడంలో మంచి ఫలితాలు కనిపించాయి. వైరస్ రకాన్ని బట్టి ప్రభావంలో కొంత తేడా ఉన్నప్పటికీ మొత్తం ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. భారత్‌లో ఈ వ్యాక్సిన్ ధరను ఇంకా ప్రకటించలేదు. అయితే హైదరాబాద్‌కు చెందిన 'బయోలాజికల్-ఈ'తో టకెడా ఇప్పటికే ఉత్పత్తి ఒప్పందం కుదుర్చుకుంది. ఏడాదికి ఐదు కోట్ల డోసులు తయారు చేసే సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. దేశీయంగా తయారీ ప్రారంభమైతే ధరలు తగ్గే అవకాశముందని భావిస్తున్నారు. మొదట ప్రైవేటు ఆసుపత్రుల్లో అందుబాటులోకి వస్తుందా, లేక ప్రభుత్వ టీకా కార్యక్రమంలో చేర్చుతారా అన్న విషయంపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## తెలంగాణలో క్యూఆర్ కోడ్‌తో కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు

**మొదటిపేజీ తరువాయి -** స్మార్ట్ కార్డులను పంపిణీ చేయనుంది. వారం రోజుల్లోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభించేందుకు పౌరసరఫరాల శాఖ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్‌లో జరిగే ప్రధాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పీవీసీ స్మార్ట్ కార్డుల రూపంలో రేషన్ కార్డులు ఇవ్వడం ఇదే తొలిసారి. ప్రస్తుతం లబ్ధిదారులు వాడుతున్న ఏ4 సైజు కాగితపు కార్డులు త్వరగా చిరిగిపోవడం, పాడైపోతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగా అందించే స్మార్ట్ కార్డులపై లబ్ధిదారుడి వివరాలతో పాటు ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్, ఆహార భద్రతా కార్డు నంబర్‌ను ముద్రించారు. భద్రతా ఫీచర్లతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు కూడా ఉంటాయి. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత వస్తుందని అధికారులు విశ్వసిస్తున్నారు. రాజధానిలో సీఎం కార్యక్రమాన్ని ప్రారంభిస్తుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల చేతుల మీదుగా లబ్ధిదారులకు కొత్త కార్డులు అందజేయనున్నారు. ఈ బృహత్తర కార్యక్రమం కోసం పౌరసరఫరాల శాఖ సమగ్ర ప్రణాళికను రూపొందించింది.

### ఒకేసారి మూడు నెలల బియ్యం

ఇదిలాఉంటే.. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పేదలకు ఇబ్బంది కలగకుండా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయనుంది. ఆగస్టు 1 నుంచి నెల రోజుల పాటు రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయి. లబ్ధిదారులు మూడుసార్లు వేలిముద్రలు వేసి తమ కోటాను పొందవచ్చు. అయితే, ఈసారి రేషన్ సరుకులు పొందాలంటే ఈ-కేవైసీ తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు. ఈ-కేవైసీ పూర్తి చేసుకునేందుకు జులై 31ని ఆఖరి తేదీగా నిర్ణయించారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కూడా తమకు దగ్గరలోని రేషన్ దుకాణంలో ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చని అధికారులు సూచించారు. గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోని వారికి రేషన్ సరుకులు అందవని స్పష్టం చేశారు.

## ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉంది



**మొదటిపేజీ తరువాయి -** ఎదుర్కోవాల్సిన చర్యలపై నల్గొండ కలెక్టరేట్‌లో సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన అధికారులతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌లు సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందని వివరించారు. రైతులు వరి పంట వేస్తే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, ఈ విషయంపై అన్నదాతలకు అవగాహన కల్పించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీళ్లు లేవని వర్షాలు కూడా తక్కువేనని మంత్రులు తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అన్నదాతలు మొగ్గు చూపాలని సూచించారు. తక్కువ నీరు అవసరమయ్యే ఆరుతడి పంటలు వేసుకోవాలని దీనిపై రైతులకు దిశానిర్దేశం చేయాలని అధికారులకు సూచించారు. ఎల్‌నినో పరిస్థితులకు తగ్గట్టుగా ఉమ్మడి నల్గొండ జిల్లా సిద్ధం కావాలన్నారు. "ఇప్పుడున్న పరిస్థితుల్లో వరి పండించేందుకు తగినంత నీళ్లు లేవు. భవిష్యత్‌లో వర్షాలు పడతాయనే నమ్మి రైతులు వరి పంట వేసినట్లయితే ఇబ్బందులు ఎదరయ్యే అవకాశం ఉంది. ఇవాళ్టి వరకు ఉన్న పరిస్థితుల ప్రకారం, పద్ద వర్షాలు, రిజర్వాయర్లలో నీటి మట్టాలు పరిశీలించినట్లయితే వరి పండించడం చాలా కష్టసాధ్యమనే విషయాన్ని మూడు జిల్లాలకు చెందిన అధికారులు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి. దీని తీవ్రతను రైతులకు వివరించాలన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇటీవల జరిగిన కేబినెట్ భేటీ ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంపై కేంద్రానికి నివేదిక ఇవ్వాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు ఇటీవల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై ఆయన అధికారులకు ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులను మళ్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన సూచించిన విషయం తెలిసిందే. ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా ఆరు తడి పంటలు వేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వరి, పత్తి వైపు వెళ్లకుండా సజ్జ, జొన్న, రాగి, వరిగలు, కంది, పెసర, మినుము, వేరుశనగ వంటి వాటితో పాటు ఆవాలు, టమాట, సోర, వంగ, బీర, దోస, కాకర వంటి కూరగాయలు సాగు చేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఆరుతడి పంటలు వేయాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నా రైతుల్లో స్పందన లేదు. వరి సాగుచేసిన భూముల్లో ముఖ్యంగా నల్లరేగడి నేలలో ఇతర పంటల సాగుకు యోగ్యంకాదని రైతులు చెబుతున్నారు. సన్నరకాల వరి పండించేందుకు కర్షకులు మొగ్గు చూపుతున్నారు. వరి తర్వాత అధికంగా పత్తిని రైతులు సాగుచేసేవారు. రెండు లక్షల సాధారణ సాగు విస్తీర్ణానికి ప్రస్తుతం లక్షఎకరాల్లో వేశారు. భవిష్యత్‌లో వర్షాభావ పరిస్థితులు తీవ్రమైతే రైతులు నష్టపోయే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,
కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

# ప్రత్యేక విస్తృత సవరణ కార్యక్రమంలో ప్రతి ఒక్క ఓటరు పాల్గొనాలి

**మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్**

**గణన ప్రక్రియపై క్షేత్రస్థాయిలో పరిశీలించిన మాజీ కార్పొరేటర్**



**కొండాపూర్,జులై 20 .అక్షర టైమ్స్ : :-(ప్రతినిధి ఎం.ఈరన్న)** ప్రత్యేక విస్తృత సవరణ కార్యక్రమంలో భాగంగా కొండాపూర్ విభాగం పరిధిలోని ఓటర్ల వివరాల సేకరణ కేంద్రాలను మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పరిశీలన సందర్భంగా పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల ఫారాలను పంపిణీ చేయడం, సమాచారాన్ని సేకరించడం, ఓటర్లతో సమన్వయం నిర్వహిస్తున్న తీరును ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రతి ఇంటి వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని, గందరగోళానికి తావు లేకుండా చూడాలని సూచించారు. విభాగం పరిధిలోని వివిధ ఓటింగ్ కేంద్రాలలో పనుల పురోగతిని సమీక్షించిన ఆయన, ఇప్పటివరకు సేకరించిన పత్రాల సంఖ్య, నిలిచిపోయిన ఇళ్ల వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. నిర్దేశిత గడువులోగా నూరు శాతం లభ్యత సాధించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అధికారులు ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని, వారికి ఎదురవుతున్న సమస్యలు, ప్రజల నుంచి వస్తున్న సందేహాలు తెలుసుకుని అవసరమైన మార్గదర్శకాలు అందించాలని సూచించారు. సేకరించిన దరఖాస్తులను అదే రోజు గణకీకరణ (డిజిటలైజ్) చేసి అంతర్జాలంలో నమోదు చేయాలని, ఎలాంటి జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు, పర్యవేక్షకులకు స్పష్టం చేశారు.

**ఓటరు జాబితా నవీకరణకు సహకరించాలి**

భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక విస్తృత సవరణ కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా పాల్గొని ఓటరు జాబితా నవీకరణ ప్రక్రియకు సహకరించాలని హమీద్ పటేల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, సరైన వివరాలతో ఓటరు జాబితా సిద్ధమైతే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని అన్నారు. ఇంటింటికీ వచ్చే అధికారులకు అవసరమైన సమాచారం, పత్రాలు అందించి సహకరించాలని కోరారు. అలాగే పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాల్లో మార్పులు ఉంటే వాటిని ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం ద్వారా సరిచేసుకోవాలని సూచించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక విస్తృత సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హమీద్ పటేల్ పిలుపునిచ్చారు.

# మియాపూర్ లో వైభవంగా 'రాజశ్యామల యాగం'

**వారాహి నవరాత్రి మహోత్సవాల్లో పాల్గొన్న టీపీసీసీ**

**ప్రధాన కార్యదర్శి వి.జగదీశ్వర్ గౌడ్**





**మియాపూర్జులై 20 .అక్షర టైమ్స్ : :-(ప్రతినిధి ఎం.ఈరన్న)** మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎస్.ఆర్. ఎస్టేట్స్ కమ్యూనిటీ హాల్‌లో ఆధ్యాత్మిక వాతావరణం విలసిల్లింది. గంగాధర శాస్త్రి, శ్రీమతి రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న శ్రీ జగదాంబిక వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు, రాజశ్యామల యాగం శ్రద్ధాభక్తులతో నిర్వహించారు. ?మియాపూర్ యువ నాయకులు, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ - నవ్యశ్రీ దంపతులు ఈ 'రాజశ్యామల యాగం' మరియు శ్రీ వారాహి అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు సమర్పించిన అనంతరం, ఆయన వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించి తీర్థప్రసాదాలను అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

**పాల్గొన్న ప్రముఖులు:**

ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో నల్ల సంజీవ్ రెడ్డి, వీరేంద్ర గౌడ్, కృష్ణ, మన్నెపల్లి సాంబశివరావు, కేవీ రావు, రాచమల్ల కృష్ణ గౌడ్ దంపతులు, రవి కుమార్, కావూరి ప్రసాద్, రవీంద్ర రెడ్డి, అశోక్ గౌడ్, వెంకటేశ్వర్లు, బాబ్జీ, సింధూర సుధీర్, ఎం.డి. షా, కేశవరావు, సత్య రెడ్డి, మూర్తి, పద్మిని ప్రియదర్శిని, సత్యనారాయణ, సాంబయ్య, చక్రపాణి, శంకర్ చారి, రామకృష్ణ, రవి కృష్ణ, శ్రీనివాసు, సుధీర్, చిరంజీవి, రాజేష్, నరేంద్ర రెడ్డి, కామినేని వాసు, వంశీ, రత్నాచారి, శశి, సతీష్, ప్రవీణ్, సీనియర్ సిటిజన్స్ గోపీనాథ్, సుబ్బారాయుడు, బాబు, రమణ, నాయుడు, సుబ్బ రెడ్డి, మురళి, రాజు, బాలమురళి, నవీన్, రాజేశ్వరి, పద్మతో పాటు స్థానిక నాయకులు, భక్తులు మరియు కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వైభవంగా వాలా హరీష్ రావు జన్మదిన వేడుకలు



**శేరిలింగంపలిజులై 20 .అక్షర టైమ్స్ : -(ప్రతినిధి ఎం.ఈరన్న)** శేరిలింగంపల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వాలా హరీష్ రావు జన్మదిన వేడుకలు సోమవారం వైశాలినగర్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సందడితో వేడుకల ప్రాంగణం కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా హరీష్ రావును అభిమానులు, నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి, పూలగుచ్ఛాలు అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పాల్గొన్న ప్రముఖులు ఈ వేడుకల్లో శేరిలింగంపల్లి బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**ఈ కార్యక్రమంలో:**

మాజీ కార్పొరేటర్ రంగా రావు గోపరాజు శ్రీనివాస్ రావు, సంగారెడ్డి, మిద్దెల మల్లారెడ్డి తిరుమలేశ్, బాబుమోహన్, మల్లేష్, దీప్తి రాజు బి.ఎస్.ఎన్. కిరణ్ యాదవ్, ధాత్రి నాథ్ గౌడ్, శ్రీనివాస్ బండి రామకృష్ణ గౌడ్, గణేష్ రెడ్డి సీనియర్ జర్నలిస్ట్ అనిల్ రెడ్డి, యాదయ్య, శేఖర్ యాదవ్ తదితర నియోజకవర్గ ముఖ్య నాయకులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు అందించారు.

## బోడుప్పల్, చెంగిచెర్లలో సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన

**డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్**

**మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్**





**మేడిపల్లిజులై 20 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి హరి మోహన్ రెడ్డి)** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్,బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ఈరోజు బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బోడుప్పల్, చెంగిచెర్ల ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్ ) కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు బూత్ స్థాయి అధికారులతో, బూత్ లెవల్ ఏజెంట్లతో మాట్లాడి కార్యక్రమం పురోగతిని తెలుసుకున్నారు. ప్రతి అర్హులైన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు కావడంతో పాటు, ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు జాబితాను పరిశీలిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరును నమోదు చేయించేందుకు ప్రజలకు సహకరించాలని కోరారు. ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్,మాజీ కార్పొరేషన్ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి,బోడుప్పల్ చెంగిచెర్ల డివిజన్ల అధ్యక్షులు బొమ్మకు కళ్యాణ్, పోగుల దిలీప్ రెసడే స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, బూత్ లెవల్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జీ అమానుషం: సిపిఐ నాయకులు టి.రామకృష్ణ

**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి**

**నీట్ పేపర్ లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలకు డిమాండ్**




**శేరిలింగంపల్లి,జులై 20 .అక్షర టైమ్స్ :(ప్రతినిధి ఎం.ఈరన్న)** ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై న్యాయం కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జీ చేయడం అత్యంత అమానుషమని, ఇది ప్రజాస్వామ్య హక్కులపై దాడి అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు టి. రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకేజీ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన తీవ్రమైన కుంభకోణమని పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన అసలు సూత్రధారులను కాపాడుతూ, న్యాయం కోరుతున్న విద్యార్థులపై పోలీసు బలప్రయోగానికి పాల్పడటం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి స్పష్టమైన నిదర్శనమని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం వారిపై లాఠీలు ఎత్తడం సిగ్గుచేటని అన్నారు.

**ప్రధాన డిమాండ్లు:**

మంత్రి రాజీనామా: పరీక్షల నిర్వహణలో వరుస వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి. కఠిన చర్యలు: పేపర్ లీకేజీ కుట్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరిని గుర్తించి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి. కేసుల ఉపసంహరణ: ఆందోళన తెలిపిన విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి. స్వతంత్ర విచారణ: విద్యార్థులపై పోలీసు దౌర్జన్యంపై స్వతంత్ర విచారణ జరిపించాలి. దేశ యువతకు నాణ్యమైన, పారదర్శకమైన విద్యా వ్యవస్థను అందించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని, కానీ పరీక్షల నిర్వహణలో వరుస వైఫల్యాలు, అవినీతి మరియు నిర్లక్ష్యంతో విద్యార్థుల విశ్వాసాన్ని ప్రభుత్వం దెబ్బతీస్తోందని రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సీఎమ్‌సీ ప్రధాన కార్యాలయంలో 'ప్రజావాణి' 37 పౌర వినతుల స్వీకరణ



**శేర్లింగంపల్లి,జులై 20 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.ఈరన్న)** సైబరాబాద్ పురపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి పౌరుల నుంచి విశేష స్పందన లభించింది. పౌర సేవలకు సంబంధించిన వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 37 వినతులను అధికారులు స్వీకరించి, నమోదు చేసుకున్నారు. విభాగాల వారీగా నమోదైన వినతుల వివరాలు: పట్టణ ప్రణాళికా విభాగం: 28 సాంకేతిక (ఇంజినీరింగ్) విభాగం: 04 ఆదాయ (ఆస్తి పన్ను) విభాగం: 02 చెరువుల సంరక్షణ విభాగం: 01 పట్టణ జీవవైవిధ్య విభాగం: 01 పశువైద్య విభాగం: 01 గడువులోగా పరిష్కరించాలని ఆదేశం అందిన వినతులను సంబంధిత విభాగాధిపతులు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వీటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులకు బదిలీ చేశారు. నిర్దేశిత గడువులోగా బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని విభాగాధిపతులు ఆదేశించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీకి ప్రత్యేక ఫిర్యాదు గుర్తింపు సంఖ్య కేటాయించినట్లు అధికారులు తెలిపారు. దీని ద్వారా ఫిర్యాదుదారులు తమ వినతుల పరిష్కార పురోగతిని పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకునే వెసులుబాటు కల్పించారు.


**కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్**

## కార్యాలయంలో ఘనంగా ఎమ్.డి.అజామ్ జన్మదిన వేడుకలు



**శేరిలింగంపల్లి,జులై 20 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.ఈరన్న)** శేరిలింగంపల్లి నియోజకవర్గం మసీద్‌బండలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్ కార్యాలయంలో పార్టీ శేరిలింగంపల్లి జనరల్ సెక్రటరీ, మైనారిటీ నాయకుడు ఎమ్.డి. అజామ్ జన్మదిన వేడుకలను సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్, ఎమ్.డి. అజామ్‌ను శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ... "అజామ్ నా ఆత్మీయ మిత్రుడు, శ్రేయోభిలాషి, సమాజ అభివృద్ధిని ఆకాంక్షించే వ్యక్తి. నిస్వార్థ సేవ, నిబద్ధత కలిగిన అజామ్ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేస్తున్నారు" అని కొనియాడారు. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మహేందర్, మారబోయిన మహేష్ యాదవ్, ఇమ్రాన్, డేవిడ్, ఆకాష్ తదితరులు పాల్గొని అజామ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రీ వాలా హరీష్‌కు ఘనంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



**శేర్లింగంపల్లి,జులై 20 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.ఈరన్న)** వాలా హరీష్ పుట్టినరోజు సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు, శ్రేణులు ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి ఆనందకరమైన పుట్టినరోజులు ఆయన మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి మొహమ్మద్ అల్లావుద్దీన్ పటేల్ (బి.ఏ. ఎల్.ఎల్.బి.) మరియు మిద్దెల మల్లారెడ్డి (గంగారం, సంగారెడ్డి) మాట్లాడుతూ.. వాలా హరీష్ ఎల్లప్పుడూ మంచి ఆరోగ్యం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని, రాబోయే రోజుల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజల ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. ప్రజల పట్ల ఆయనకున్న సేవాభావం, పార్టీ పట్ల ఆయన ఓఅంకితభావం ఇలాగే కొనసాగుతూ, బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి మరింత శక్తివంతంగా సేవలందించాలని కోరారు. ఆయన నాయకత్వంలో పార్టీ మరిన్ని విజయాలు సాధించి, ప్రజలకు మరింత చేరువ కావాలని హృదయపూర్వకంగా ఆశిస్తున్నట్లు తెలిపారు.

## యాదవ కమ్యూనిటీ హాల్ ప్రారంభానికి ముమ్మర ఏర్పాట్లు

**పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, మెట్టు కుమార్ యాదవ్**





**పటాన్చెరు,జులై 20 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.వీరేష్)** పటాన్చెరు డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్ (గొల్లబస్తీ) కాలనీలో నాలుగు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన యాదవ కమ్యూనిటీ హాల్ ప్రారంభానికి సిద్ధమవుతోంది. వచ్చే నెల ఆగస్టు 19న ఈ కళ్యాణ మండపం ప్రారంభం కానున్న నేపథ్యంలో, సోమవారం పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ నిర్మాణ పనులను పరిశీలించారు.

**పేద ప్రజలకు మేలు**

ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. సామాన్య, పేద ప్రజలు శుభకార్యాలు జరుపుకోవడానికి ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్ ఖర్చులు భారంగా మారుతున్నాయి. ఈ సమస్యను గుర్తించి, స్థానిక పేద ప్రజలకు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో జీహెచ్ఎంసీ నిధులతో ఈ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించడం జరిగిందని తెలిపారు. నాలుగు కోట్ల రూపాయల వ్యయంతో అన్ని వసతులతో ఈ కళ్యాణ మండపం రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు.

**సకాలంలో పూర్తి చేయాలని ఆదేశం**

ప్రారంభోత్సవానికి గడువు సమీపిస్తున్నందున, ఎటువంటి పెండింగ్ పనులు లేకుండా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా విద్యుత్ విభాగం నుంచి ఎటువంటి లోపాలు తలెత్తకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, సపాన దేవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, యాదవ సంఘం అధ్యక్షుడు దేవయ్య, ఉపాధ్యక్షులు మల్లేష్, శ్రీశైలం యాదవ్, నాగరాజు యాదవ్, ఇతర సంఘ ప్రతినిధులు మరియు నాయకులు పాల్గొన్నారు.

## అభిలాష వొకేషనల్ సెంటర్ అభివృద్ధి పనులను ప్రారంభించిన ఆదర్శ్ రెడ్డి, సింధు ఆదర్శ్ రెడ్డి






**పటాన్‌చెరుజులై 20 .అక్షర టైమ్స్ : -(ప్రతినిధి ఎం.వీరేష్)** పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, భారతీనగర్ విభాగం మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి బిహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని అభిలాష వృత్తి విద్యా కేంద్రంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ప్రముఖ సంస్థల సహకారంతో పాఠశాల యాజమాన్యం కోరిక మేరకు ఈ పనులను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షురాలు శ్రీదేవి, ప్రధానోపాధ్యాయురాలు నీలిమ, సేల్స్‌ఫోర్స్ ప్రతినిధులు సుదీప్ కంచర్ల, అభినేష్ బద్దం, చంద్ర సమల, స్వప్న, నిర్మాణ్ సంస్థ ప్రతినిధులు నీరజ, నికి, సౌమ్య పాల్గొన్నారు. పాఠశాలలోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు తయారు చేసిన వస్తువులను పరిశీలించి వారిని అభినందించారు. గతంలో బొంబాయి కాలనీ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలో సంస్థలు అందించిన సహకారాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సమాజ సేవలో నిరంతరం భాగస్వాములవుతున్న సంస్థలకు పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజల తరఫున ఆదర్శ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తోంట అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు దేవేంద్ర చారి, పాటి సత్యనారాయణ, నర్సింహ, బాల్ నర్సింగ్, సంపత్ గౌడ్, ఘౌస్, సరిత, రాణి యాదవ్, రాకేష్, జకీర్, నరేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అంకాలమ్మ తల్లి బోనాల మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు,జులై 20 .అక్షర టైమ్స్ :** గిద్దలూరు నియోజకవర్గం కొమరోలు మండలం గోపానిపల్లె గ్రామంలో జరుగుతున్న శ్రీ అంకాలమ్మ తల్లి బోనాలు 16 రోజుల పండుగ మహోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీ ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి ,పార్టీ స్థానిక నాయకులు ,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



**గోకవరం,జులై 20 .అక్షర టైమ్స్ :** గోకవరం కరెంట్ ఆఫీస్ వెళ్లే దారిలో ఉన్న ది.గోకవరం ప్రెస్ క్లబ్ కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్విని చేసుకోవాలని ప్రెస్ క్లబ్ సభ్యుల కోరారు. ప్రెస్ క్లబ్ దివంగత అధ్యక్షులు రౌతు పండు జయంతిని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన ఈ వైద్య శిబిరంలో రాజమహేంద్రవరం సన్ స్టార్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు పాల్గొననున్నారు. ఈ వైద్య శిబిరంలో గుండె వైద్య నిపుణులు ఎం సుధాకర్, న్యూరాలజిస్ట్ జమ్ము కోదండరాం, ప్రసూతి వైద్య నిపుణులు కే భాగ్య ప్రీతి , ఎముకల వైద్య నిపుణులు ఆర్ సి కార్తీక్ లో పాల్గొని వైద్యశాల అందిస్తారని పిఎంపి మండల శాఖ అధ్యక్షులు పి చిన్ని తెలిపారు. వీరితోపాటు రాజానగరం లెనోరా దంత వైద్య కళాశాల వైద్య నిపుణులు పాల్గొని ఉచితంగా వైద్య సేవలు అందించనున్నారు. బుధవారం ఉదయం 9 గంటల నుండి ప్రారంభమయ్యే ఈ వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని ప్రెస్ క్లబ్ సభ్యులు కోరారు.

# ప్రతి ఇంటి నుంచి మహిళా పారిశ్రామికవేత్త కావాలన్నదే లక్ష్యం మంత్రి నారాయణ



**నెల్లూరు,జులై 18 .అక్షర టైమ్స్ :** ప్రతి ఇంటి నుంచి కనీసం ఒక మహిళా పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం విస్తృత అవకాశాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. సోమవారం నెల్లూరులోని చింతారెడ్డి పాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో మెప్మా అధికారులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీఓలు), రిసోర్స్ పర్సన్లు (ఆర్పీలు), మహిళా సంఘాల సభ్యులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. మెప్మా మహిళలు నిర్వహిస్తున్న వివిధ వ్యాపారాల పురోగతి, లావాదేవీలపై ఆరా తీశారు. జీవనోపాధి అవకాశాలను మరింత విస్తరించేందుకు పలు సూచనలు చేశారు.పట్టణ పేదరిక నిర్మూలనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, లైవ్లీహుడ్ యూనిట్ల ద్వారా మహిళలకు స్థిరమైన ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. వ్యాపారాల్లో మహిళలపై ఒత్తిడి తగ్గించేలా ప్రత్యేక ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.పాచిపని చేసుకునే మహిళ కూడా నేడు పారిశ్రామికవేత్తగా ఎదిగి కోట్ల రూపాయల టర్నోవర్ సాధిస్తోందని పేర్కొంటూ, మెప్మా మహిళలందరూ అలాంటి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. వ్యాపారాల్లో రాజకీయాలను చొప్పించవద్దని, రిసోర్స్ పర్సన్లు నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా పనిచేయాలని సూచించారు. చిన్న వ్యాపారాలు నిర్వహిస్తున్న మహిళలను గుర్తించి ప్రోత్సహించాలని అధికారులకు ఆదేశించారు. మెప్మా మహిళల్లో అత్యధికులు నిరుపేదలేనని, తాను కూడా పేదరికం నుంచి వచ్చిన వ్యక్తినేనని మంత్రి గుర్తుచేశారు. వారి కష్టాలు తనకు తెలుసని, వారి ఆర్థికాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తూనే ఉంటానన్నారు. వారి పిల్లలకు విద్యనే నిజమైన ఆస్తిగా అందించాలనే ఉద్దేశంతో నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 10 వేల సైకిళ్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. మెప్మా మహిళల వ్యాపారాభివృద్ధిపై ప్రతి నెలా సమీక్ష నిర్వహించి, లక్ష్యాల సాధనను పర్యవేక్షిస్తానని మంత్రి స్పష్టం చేశారు. సమీక్షలో మెప్మా ఏఎండి వెంకటేశ్వర్లు, పీడీ కిరణ్, మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# హత్య రాజకీయాలకు ఆజ్యం పోస్తున్న కావలి మాజీ ఎమ్మెల్యే

**ఇంటిని ముట్టడిస్తామన్న ఎస్సీ సెల్ నేతలు**

**దళితులపై దాడులు, మారణ హోమాలు వైసిపి పాలనలోనే**

**దెబ్బకు దెబ్బ, చావుకు చావు కై వైసిపి సిద్ధంగా ఉండాలి**

**మా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి కనుసైగ చేస్తే కావలిలో వైసిపి కనుమరుగు కావడం ఖాయం**

**వాసు మర్డర్ కేసుపై దళిత, గిరిజన నేతలు ఘాటుగా స్పందించిన వైనం**




**కావలి,జులై 20 .అక్షర టైమ్స్ :** మునుపెన్నడు లేని విధంగా వైసిపి గొడ్డలి పార్టీ అధికారం లోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యంగా దళిత, గిరిజనులపై దాడులు, హత్యలు, హత్య రాజకీయాలకు శ్రీకారం చుట్టారని కావలి నియోజకవర్గం ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఘాటుగా మాట్లాడారు. సోమవారం కావలి టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కావలి పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, జిల్లా నాయకులు చంద్రశేఖర్, దావులూరి దేవకుమార్, తదితర ఎస్సీ నాయకులు మాట్లాడారు. ముఖ్యంగా రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళిత, గిరిజన నేతలు, కార్యకర్తలపై హత్య రాజకీయాలు జరుగుతున్నాయన్నారు. అదే క్రమంలో గొడ్డలి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి బాటలో కొనసాగుతున్న కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి రాష్ట్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో జరిగే హత్య రాజకీయ మాదిరిగా కావలి మాజీ పోటీపడి మారీ చేయిస్తున్నారని విమర్శలు చేశారు. రాష్ట్రంలో గత రాజకీయాలు వేరు, ప్రస్తుత రాజకీయాలు వేరుగా ఉన్నాయని తెలిపారు. వైసిపి పార్టీకి అధికారం ఉన్నప్పుడు, అధికారం లేకపోయినా జగన్ తో పోటీపడి కావలి మాజీ ఎమ్మెల్యే హత్య రాజకీయాలు చేయిస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. కావలి రూరల్ మండలం సర్వాయపాలెం పంచాయతీ, తాగేటిపాలెం నకు చెందిన చాట్ల వాసు అనే వ్యక్తి పార్టీలో బలంగా ఉన్నాడన్న కారణంగా, టిడిపి కార్యకర్త లను వైసిపి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి అనుచరుడు, మాజీ సర్పంచ్ మంద మధు ప్రధాన నిందితుడిగా ఉండి హత్యకు పాల్పడటం ఘోరమైన సంఘటనగ వివరించారు. ఆ గ్రామంలో భయాందోళన చేయించి, టిడిపి పార్టీ కేడర్ ను బలహీన పరిచే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గతంలో వైసిపి అధికారంలో ఉన్నపుడు దుగ్గిరాల కరుణాకర్, తేజ, పైడి హర్ష అనే టిడిపి ఎస్సీ నేతలపై గొడ్డలి పార్టీ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి హత్య రాజకీయాలు చేశారని, ప్రస్తుతం అధికారం కోల్పోయినప్పటికీ తట్టుకోలేక తిరిగి అదే పందాలో నేడు హత్య రాజకీయాలు చేయిస్తున్నాడని ఆరోపించారు. టిడిపి కార్యకర్త చాట్ల వాసు మర్డర్, టిడిపి మాజీ ఎంపీటీసీ అరగల కిష్టయ్య పై వైసిపి నేతలు దాడులకు పాల్పడటం చూస్తుంటే ఈ వైసీపీ గొడ్డలి పార్టీ ఆధ్వర్యంలోనే ఎస్సీ, ఎస్టీ లపై దాడులు చేస్తున్నారని, ఎస్సీలపై ఎస్సీలను, ఎస్టీ లపై ఎస్టీ లను పురుగోలీపి వీరిని హత్యలకు గురిచేయడం, జైళ్లకు పంపడం వెనుక పక్కా ప్రణాళికలు చేపడుతున్నారని విమర్శలు చేశారు.కావలి నీ ప్రశాంతంగా ఉంచాలని చూస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఓపికను పరిశీలిస్తున్నారా అని ప్రశ్నించారు. మా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి కానుసైగ చేస్తే కావలిలో వైసిపి కనుమరుగు కావడం ఖాయం అన్నారు. అలాంటి దుర్మార్గపు చర్యలకు మా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి దూరంగా ఉంటూ, కావలిని అభివృద్ధి చేసి అనేక కంపెనీలు కావలికి తీసుకు రావాలి అన్నదే కావ్య కృష్ణరెడ్డి ప్రణాళిక అన్నారు. అంతేగానీ హత్య రాజకీయాలు ఆయనకు తెలియవు అన్నారు. ఎస్సీ, ఎస్టీ లను పావులుగా వాడుకుంటున్న ఈ గొడ్డలి పార్టీ నేతలను కావలి మేధావులు, ఆయా పార్టీలలో ఉన్న ఎస్సీ ఎస్టీ నాయకులు గుర్తించి మేలుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో ఎస్సీ ఎస్టీ లు రాజకీయాల్లో ఎదగడం ఈ గొడ్డలి పార్టీ నాయకులకు ఇష్టం లేదనే సత్యం గుర్తించాలి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వాసు చురుకుగా ఉంటారనే ఉద్దేశ్యంతో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి అనుచరుడు మంద మధు హతమార్చారని అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని , ఆ కుటుంబానికి టిడిపి పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. వైసిపి తీరు మారకపోతే మా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అనుమతి తెలుసుకొని గొడ్డలి పార్టీ నేతలకు బుద్ధి చెపుతున్నారు. దెబ్బకు దెబ్బ, చావుకు చావు అనే నినాదంతో ఇక ముందుకు పోవలసి వస్తుంది అనీ, అందుకు వైసిపి నాయకులు సిద్ధంగా ఉండాలనీ ఘాటైన విమర్శలు చేశారు. కులాల మధ్య, మతాల మధ్య రాజకీయాలు చేస్తూ , కుటుంబాల మధ్య సంబంధాలు లేకుండా చేసి రాజకీయాలు చేయడం ఈ గొడ్డలి పార్టీ నైజం అన్నారు.ఈ కార్యక్రమంలో దళిత నాయకులు,జ్యోతి బాబురావు, ఏగూరి చంద్రశేఖర్,దావులూరి దేవకుమార్,లేలపల్లి సుధీర్,వల్లేరి కిరణ్ కుమార్,చెవురుపాటి కొండయ్య, మొగిలి విజయ్,అక్కిలిగుంట సూరి ప్రకాష్,కమతం శీను,పర్రి రవి, తాళ్లపాలెం రవి,రమణ తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న "నాగార్జున" విద్యార్థి పూర్ణ చందు

**రూ.20 వేల నగదు, సర్టిఫికెట్, మెమెంటో ప్రదానం**






**పొదలకూరు,జులై 20 .అక్షర టైమ్స్ : (రిపోర్టర్ ఆనంద్)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "షైనింగ్ స్టార్ అవార్డ్స్--2026" కార్యక్రమంలో పొదలకూరు కు చెందిన నాగార్జున స్కూల్ విద్యార్థి మేకల.పూర్ణ చందు ప్రతిభ కనబరిచి షైనింగ్ స్టార్ అవార్డును అందుకున్నాడు.సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్. బాలాజీ రావు చేతుల మీదుగా పూర్ణచందు కు రూ.20 వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు.పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డులను అందజేస్తోంది.ఈ నేపథ్యంలో జిల్లాలో ఎంపికైన ప్రతిభావంతులైన విద్యార్థుల్లో పూర్ణ చందు ఒకరిగా నిలిచి ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకోవడం విశేషం.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పూర్ణచందును అభినందించారు. విద్యార్థి కృషి, పట్టుదల, తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.పూర్ణచందు సాధించిన ఈ ఘనత పాఠశాల విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు విద్యార్థుల్లో మరింత పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పూర్ణచందుకు ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు, విద్యావేత్తలు, స్థానిక ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

## రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు..

**భక్తులతో కళకళలాడిన పొదలకూరు శివాలయం**





**పొదలకూరు,జులై 20 .అక్షర టైమ్స్ : రిపోర్టర్ ఆనంద్)** పొదలకూరు పట్టణంలోని కామాక్షితాయి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.తెల్లవారు జాము నుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రామలింగేశ్వర స్వామికి పాలు, పెరుగు, తేనె, పండ్ల రసాలు, పవిత్ర జలాలతో మహాభిషేకం నిర్వహించారు. అనంతరం రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామార్చన, అలంకరణ, మహామంగళహారతి వంటి విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన స్వామి, అమ్మవారిని దర్శించుకున్న భక్తులు కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఐశ్వర్యం కలగాలని ప్రార్థించారు.ఆలయ ప్రధాన అర్చకులు పి.బి.ఎస్.వి. ప్రసాద్ స్వామి, అర్చకులు కుమారస్వామి, మనోహర స్వాములు వేదమంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## పోలీసులు పలువురూ మీడియా, పత్రిక ప్రతినిధులకు నోటీసులు

**వ్యతిరేకంగా జర్నలిస్ట్ జె.ఏ.సి పోలీసు స్టేషన్ వద్ద భారీ ర్యాలీ**

**వెంకటాచలం పోలీస్ స్టేషన్లో కొనసాగుతున్న విచారణ**



**నెల్లూరు,జులై 20 .అక్షర టైమ్స్ :** ఇటీవల నెల్లూరు జిల్లా మనుబోలు మండలం చెరుకుమూడికి చెందిన బొల్లు ఏడుకొండలు అనే వ్యక్తి ఓ దొంగతనం కేసులో అరెస్టై అనంతరం మరణించిన విషయం తెలిసిందే, ఏడుకొండలు మరణం పై మనుబోలు పోలీసులు వ్యవహరించిన తీరు పై ఏడుకొండల కుటుంబ సభ్యులు పోలీసుల వేధింపుల వల్లే ఏడుకొండలు మృతి చెందారని పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు, ఈ కేసు కు సంబంధించి వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాని గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నెల్లూరు జిల్లా డిసిసి అధ్యక్షులు కిరణ్ కుమార్ రెడ్డి కూడా ఏడుకొండలు మృతిలో పోలీసుల పాత్ర ఉందని మీడియాతో మాట్లాడారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా, డిజిటల్ ప్లాట్ ఫాం లలోనూ పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి, ఈ నేపథ్యం లో వెంకటాచలం పోలీసులు పలు దినపత్రికల బ్యూరో ఇన్చార్జికు, మనుబోలు ప్రతినిధికి, ఓ శాటిలైట్ కరస్పాండెంట్ కు, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఇన్చార్జిలకు వెంకటాచలం పోలీసులు నోటీసులు అందించారు, దీంతో పాత్రికేయులు ప్రతినిధులు పోలీస్ విచారణకు సోమవారం హాజరయ్యారు, విచారణ కొనసాగుతుంది.

## పేషంట్లకు సేవలందించడంలోనే అపారమైన సంతృప్తి

**సీ.జీ.హెచ్.ఎస్ ఫార్మాసిస్ట్ లక్ష్మీ కౌసల్య**




**గుంటూరు/ప్రతినిధి,జులై 20 .అక్షర టైమ్స్ :** డాక్టర్ అఫ్ ఫార్మసీ డిగ్రీ ద్వారా, మెడికల్ ప్రొఫెషనల్ గా పేషంట్లకు ఆరోగ్య సంరక్షణ సలహాలు ఇవ్వడం, ఔషధాలపై పూర్తి అవగాహన, భరోసా ఇవ్వడం, మందుల మోతాదులు, దుష్ప్రభావాలు, ఉపయోగించే పద్ధతి, నిల్వ విధానాలను ప్రతి రోగి కి వెల్లడించడం లోనే అసలైన అనుభూతి, సంతృప్తి లభిస్తుందని సీ.జీ.హెచ్.ఎస్ ఫార్మాసిస్ట్ జీ. లక్ష్మీ కౌసల్య పేర్కొన్నారు. గుంటూరు నగరంపాలెంలోని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి (సీ.జీ.హెచ్.ఎస్) విజయవాడ నుండి బదిలీ పై వచ్చిన లక్ష్మీ కౌసల్య సోమవారం నూతన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గుంటూరు సీ.జీ.హెచ్.ఎస్ పరిధి లోని ఐదు జిల్లాల ఉద్యోగులు, పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులకు బ్రాండెడ్ కంపెనీలకు చెందిన నాణ్యమైన ఉత్పత్తులను సిఫార్స్ చేసి, అందించడమే తన లక్ష్యమన్నారు. ఇక్కడి డాక్టర్ల సలహాలు, సూచనలతో రోగులకు విలువైన సేవలు అందిస్తానని వెల్లడించారు. సీ.జీ.హెచ్.ఎస్ లోకల్ ఎడ్వైజరీ కమిటీ మెంబర్లు గుమ్మడి సీతారామయ్యచౌదరి, కట్టా వెంకటేశ్వర్లులు, నూతన ఫార్మాసిస్ట్ లక్ష్మీ కౌసల్య కు పుష్పగుచ్ఛం అందించి మాట్లాడుతూ.. అత్యంత నైపుణ్యం, విశ్వసనీయత కలిగిన ఔషధ నిపుణులుగా రాణించాలని కోరారు. మందుల భద్రత, స్టాక్ నిర్వహణతో పాటు రోగులకు మందులను సరిగ్గా అందించాలని సూచించారు. తోలుత లక్ష్మీ కౌసల్య చీఫ్ మెడికల్ ఆఫీసర్లు కొండా నాగార్జున, దాసరి రమేష్ లను మర్యాదపూర్వకంగా కలిసి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ హేమ సుందరి, వైద్య సిబ్బంది సునీల్, పేరేశ్వరరావు, రామారావు తదితరులు లక్ష్మీ కౌసల్య కు శుభాకాంక్షలు తెలిపారు

## దోసకాయలపల్లిలో కంబాల కానుక వనితల వేడుకకు విశేష స్పందన

**1300 మంది మహిళలకు ఉచితంగా పట్టు చీరలు పంపిణీ**





**గోకవరం,జులై 18 .అక్షర టైమ్స్ :** కోరుకొండ మండలం దోసకాయపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి నిర్వహించిన కంబాల కానుక వనితల వేడుక పట్టు చీరలు పంపిణీ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలిత ఆయనకు మహిళలు హారతులు పట్టారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, అభిమానులు ఘన స్వాగతం పలికి, పూలమాలలతో సత్కరించారు. గ్రామాలలోని ఆలయాలను దర్శించుకుని, పూజలు నిర్వహించి, గ్రామ దేవతలకు తొలి చీరలను సమర్పించారు. ఈ కార్యక్రమానికి గ్రామంలో మహిళల నుంచి విశేష స్పందన లభించింది. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని, జయప్రదం చేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు 1300 మంది మహిళలకు ఉచితంగా పట్టు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రావణమాసం సందర్భంగా మహిళలకు ఉచితంగా పట్టుచీరలను అందించేలాగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమైనదని, వారిని గౌరవించుకోవడం మన బాధ్యతని అన్నారు. కులమతాలకు అతీతంగా మూడు నియోజకవర్గాల్లో తమ సేవలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజల ఆశీర్వాదం, సహకారంతో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. సమాజ సేవే తన లక్ష్యమని అన్నారు. ధర్మాన్ని పాటించేవారి పక్కన ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు, అభిమానులు, యువత తదితరులు పాల్గొన్నారు.

## యనమలవారి వీధిలో కూలిన పాత ఇంటి స్లాబు

**ముగ్గురిని సురక్షితంగా బయటకు తీసిన రెస్క్యూ బృందం**

**ఘటనాస్థలిని పరిశీలించిన మంత్రి నారాయణ**





**నెల్లూరు,జులై 18 .అక్షర టైమ్స్ :** నెల్లూరు నగరంలోని 49వ డివిజన్ యనమలవారి వీధిలో సోమవారం 60 సంవత్సరాల నాటి పాత ఇంటి స్లాబు ఒక్కసారిగా కూలింది. శిథిలాల కింద చిక్కుకున్న ముగ్గురిని అగ్నిమాపక, రెస్క్యూ సిబ్బంది సమయస్ఫూర్తితో సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సోమవారం హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని కూలిన ఇంటిని పరిశీలించారు. బాధితులు, అధికారులు, స్థానికులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలను పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కూలిన ఇల్లు సుమారు 60 ఏళ్ల క్రితం నిర్మించిందని తెలిపారు. ఆ భవనంలో ఎనిమిది కుటుంబాలు నివాసం ఉంటున్నాయని చెప్పారు. శిథిలాల కింద చిక్కుకున్న ముగ్గురిని సురక్షితంగా బయటకు తీసుకురావడంలో సమయస్ఫూర్తితో వ్యవహరించిన అగ్నిమాపక శాఖ సిబ్బందిని అభినందించారు. బాధిత ఎనిమిది కుటుంబాలకు టిడ్కో ఇళ్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఎవరు ఆపదలో ఉన్నా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, బాధితులకు తక్షణ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేతారెడ్డి, 48వ డివిజన్ ప్రెసిడెంట్ బండి ప్రసాద్, కో-క్లస్టర్ ఖాదర్ బాషా, క్లస్టర్ కప్పిరి శ్రీనివాసులు, రేవతి, ముజీబ్, గౌస్ మస్తానమ్మ, షబ్బీర్ స్థానిక టిడిపి నేతలు తదితరులు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్స్ అవార్డుతో విజ్ఞాన్ విద్యార్థిని నిత్యకృతికకు రాష్ట్ర స్థాయి గౌరవం

**992 మార్కులతో జిల్లా ప్రథమ స్థానం సాధించిన ప్రతిభకు గుర్తింపు**



**పొదలకూరు,జులై 20 .అక్షర టైమ్స్ : (రిపోర్టర్ ఆనంద్)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందజేస్తున్న "షైనింగ్ స్టార్స్ అవార్డు -- 2026"ను పొదలకూరులోని విజ్ఞాన్ జూనియర్ కాలేజీ విద్యార్థిని దేవళ్ల నిత్యకృతిక అందుకుంది.ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను 992 మార్కులు సాధించిన నిత్యకృతిక రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంక్, జిల్లా ప్రథమ స్థానం సాధించి విశేష ప్రతిభ కనబరిచింది. ఈ ఘనతకు గుర్తింపుగా సోమవారం నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆర్ఐఓ వరప్రసాద్ చేతుల మీదుగా ఆమెకు రూ.20 వేల నగదు బహుమతి, మెడల్, ప్రశంసా పత్రం ప్రదానం చేశారు.ఈ సందర్భంగా విజ్ఞాన్ జూనియర్ కాలేజీ యాజమాన్యం సుధాకర్ రెడ్డి, జి.ఎన్. రెడ్డి, సుబ్బారావు, కృష్ణ, చంద్రశేఖర్ నిత్యకృతికను అభినందిస్తూ, ఆమె సాధించిన విజయం కళాశాలకే కాకుండా పొదలకూరుకు గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## షైనింగ్ స్టార్ అవార్డ్ లను కైవసం చేసుకున్న బిట్రగుంట విద్యార్థులు




**కావలి,జులై 20 .అక్షర టైమ్స్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన "షైనింగ్ స్టార్ అవార్డ్స్--2026" కార్యక్రమంలో బోగోలు మండలం, అక్కరాజువారి కండ్రికకు చెందిన యం.కె.ఎస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకున్నారు. సోమవారం నెల్లూరులోని కస్తూరిబా కళాక్షేత్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పురస్కారాల ప్రదానోత్సవంలో, పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం షైనింగ్ స్టార్ అవార్డ్స్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా సింబోతుల వెంకట తేజేశ్వంత్ మరియు ములి లాష్య అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకుని పాఠశాలకు, బోగోలు మండలానికి గౌరవం తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సాధనల మనోహర్ నాయుడు మాట్లాడుతూ, విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల నిబద్ధత, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ ఘన విజయం సాధ్యమైందన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించి పాఠశాలకు మరిన్ని విజయాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రముఖులు అభినందించారు. ఈ విజయం బిట్రగుంట ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది.

# మెదడుకు మైక్రాన్ చికిత్స మరింత డీప్‌గా పరిశోధనలు!

### మెదడుకు మైక్రాన్ చికిత్స
### మరింత డీప్‌గా పరిశోధనలు!
### కీలక రీసెర్చ్ చేస్తున్న ఐఐటీ మద్రాస్‌లోని ఎస్‌జీబీసీ విభాగం



బ్రెయిన్ చికిత్సలో భారీ మార్పులకు అవకాశాలున్నాయంటున్న నిపుణులు

మానవ శరీరంలోని గుండె, కళ్లను అత్యంత సూక్ష్మస్థాయిలోనూ వైద్యులు చూడగలుగుతున్నారు. చికిత్సలు చేస్తున్నారు. మరి, మెదడును అంతే సూక్ష్మ స్థాయిలో చూడగలుగుతున్నారా అంటే, లేదనే సమాధానమే వస్తోంది. కపాలంలో ఉండే ఈ భాగంపై ఇప్పటి వరకూ విస్తృతస్థాయి సూక్ష్మ పరిశోధనలు లేవు. ఈ నేపథ్యంలోనే ఐఐటీ మద్రాసు ఈ అంశాన్ని సవాల్‌గా తీసుకుని పరిశోధనలు సాగిస్తూ, పురోగతి సాధిస్తోంది. ఈ క్రమంలో మెదడు లోపలి భాగాల్లోని కణజాలాల అమరిక, ప్రవర్తనపై ఐఐటీ మద్రాస్ చేసిన పరిశోధనలు ఏం చెబుతున్నాయో ఇప్పుడు తెలుసుకుందాం!

ఐఐటీ మద్రాస్‌లోని సుధా గోపాలకృష్ణన్ బ్రెయిన్ సెంటర్(ఎస్‌జీబీసీ) కీలక పరిశోధనల దిశగా అడుగులు వేస్తోంది. మెదడు లోపలి పొరల్లో కణజాల ఆకృతి ఎలా ఉంది సాధారణ వ్యక్తుల్లో, జబ్బుపడిన వారిలో కనిపించే మార్పులేంటనేది అత్యంత సూక్ష్మంగా పరిశీలన చేస్తున్నారు. 3డీ ఇమేజీల్నీ తీస్తున్నారు. అమెరికాకు చెందిన పరిశోధకులతోపాటు వేలూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజీ, బెంగళూరు నిమ్‌హాన్స్, చెన్నై సవిత మెడికల్ కాలేజీ, మెడిస్కాన్ తదితర సంస్థలతో కలిసి ఈ పరిశోధనల్ని విస్తృతం చేశారు.

**బహుళభాషా నైపుణ్యంతో మెదడుకెంతో మేలు!**

**తాజా పరిశోధనలో కీలక విషయాలు!**

450 బ్రెయిన్ల సేకరణ : ఎస్‌జీబీసీ పరిశోధకుల ప్రకారం.. ప్రస్తుతం మెదడులోని భాగాన్ని ఎంఆర్ఐ ద్వారా చూడగలుగుతున్నారు. ఇందులో మిల్లీమీటర్ల స్థాయి వరకే చూడొచ్చు. మెదడులోని కణజాలాల్ని బాగా చూడాలంటే మైక్రాన్ల సైజుకు వెళ్లాలి. ఒక్కో కణజాలం 5-10 మైక్రాన్లు ఉంటుంది. అంటే, మానవుని వెంట్రుకలో 5-10వ వంతు. ఆ స్థాయిలో కణజాలాన్ని, అందులోని మార్పుల్ని వైద్యులు చూడగలిగినప్పుడే మెదడుకు కచ్చితమైన చికిత్స ఇవ్వగలరని నిపుణులు చెబుతున్నారు. ఇందుకోసమే ఎస్‌జీబీసీలో అధునాతన యంత్రాలతో ఇమేజింగ్ వ్యవస్థ తెచ్చారు. దీనిపై ఇంజినీరింగ్, వైద్య, సాంకేతిక, ల్యాబొరేటరీ తదితర విభాగాలకు చెందిన నిపుణులు పనిచేస్తున్నారు. పరిశోధన కోసం ఇప్పటివరకు 450 మంది చనిపోయిన వారి మెదడుల్ని సేకరించారు. వీటిలో పిండం దశ నుంచి 60 ఏళ్ల వయసు వరకు ఉన్నాయి. వాటిని అధునాతన యంత్రాల్లో నిల్వ ఉంచి సూక్ష్మంగా పరిశోధిస్తున్నారు.న్యూరాలజీ, అనుబంధ విభాగాలకు సంబంధించి ఇదో కీలక పరిశోధన. మెదడును మరింత క్షుణ్ణంగా చూడగలిగితే వైద్యంలో అద్భుతాలు జరగొచ్చు. మా పరిశోధన ద్వారా భవిష్యత్తులో వైద్యవిధానాల్లో పెనుమార్పులు రావడానికి అవకాశాలున్నాయి. కొత్త ఔషధాల ఉత్పత్తికి ఆస్కారముంది. ఫలితంగా కొన్ని కోట్ల మందికి మంచి జరగొచ్చు. వాణిజ్యపరంగా కొత్తమార్గాలు తెరచుకోవడంతోపాటు బ్రెయిన్ ఇమేజింగ్‌లో డేటా సెట్స్ అనలైజర్లు పెరగడంతో పాటు మెదడుపై క్లినికల్ ట్రయల్స్ జరిగేందుకు ఊతమిస్తుంది - ప్రొఫెసర్ మోహనశంకర్ శివప్రకాశం, ఎస్‌జీబీసీ హెడ్‌వ్యాధిగ్రస్తుల్లో ఎలా ఉంది : ఈ పరిశోధనల్లో భాగంగా తల్లి గర్భంలో ఉన్న పిండం మెదడు లోపలి భాగాలు వివిధ వారాల్లో ఎలా ఉంటాయనేది సూక్ష్మంగా కణజాలస్థాయిలో 3డీ మ్యాపుల్ని ఈ ఏడాది విడుదల చేశారు. ఈ ప్రయత్నం ప్రపంచంలోనే తొలిసారి అని అక్కడి పరిశోధకులు చెబుతున్నారు. ప్రస్తుతం పుట్టిన బిడ్డ నుంచి పెద్ద వయసుల వారి వరకు మెదడు లోపలి భాగాలకు 3డీ ఇమేజీల్ని తీస్తున్నారు. సాధారణ వ్యక్తుల్లో కణజాల స్థాయిలో మెదడు ఎలా ఉంది రేబిస్, కొవిడ్, అల్జీమర్స్ వంటి వ్యాధులున్న వారిలో మెదడు కణజాలస్థాయిలో వచ్చిన మార్పులేంటి అనే విషయాలు అంచనా వేస్తున్నారు. వచ్చే ఏడాది ఈ ఫలితాల్ని విడుదల చేసేందుకు ముందుకెళ్తున్నారుడేటా దాచే రహస్యం కోసం : ఒక మనిషి మెదడు సుమారు 2.5 పెటాబైట్స్ (పీబీ) మెమరీ సామర్థ్యం కలిగి ఉంటుందని అంచనా. అంటే.. 2.5 కోట్ల గిగాబైట్ల మెమరీ. ఇంత డేటాను మెదడు ఎలా దాచుకోగలుగుతోంది మనిషి మెదడులోని అమరిక దీనికి ఎలా సహకరిస్తోందనేది ఎస్‌జీబీసీ చేస్తున్న మరో ఆసక్తికర పరిశోధన. ఈ పరిశోధనల తర్వాత అతితక్కువ స్థలంలో ఎక్కువ స్టోరేజీ సాంకేతికతపై దృష్టి సారించే అవకాశాలున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇందులో వేగవంతమైన ఫలితాల్ని చూసేందుకు కృత్రిమమేధ సాంకేతికతనూ వాడుతున్నారు.

ఇక్కడ మీకు అందించిన సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది

# ఇంట్లోనే బీపీ, షుగర్ చెక్ చేసుకుంటున్నారా

### ఈ జాగ్రత్తలు పాటించాలట!
### బీపీ, షుగర్ రీడింగ్స్‌లో తేడాలొస్తాయంటున్న నిపుణులు
### చెక్ చేసుకోవడానికి పద్ధతులుంటాయట






బీపీ, డయాబెటిస్ శరీరంలో నిశ్శబ్ధంగా విధ్వంసం సృష్టిస్తాయి. ఒక్కసారి ఇవి నిర్ధారణ అయ్యిందంటే చాలు! జీవనశైలి, ఆహారపు అలవాట్లు మార్పులతోపాటు రోజూ వ్యాయామం చేస్తుంటారు. బీపీ, డయాబెటిస్, బరువు చూసుకునే డిజిటల్ పరికరాలు కూడా ఇంట్లోనే పెట్టుకుంటారు. వీటితో తరచూ కొలతలు చూసుకుంటారు. ఈ క్రమంలో కొన్ని సార్లు రీడింగ్‌లో మార్పులు వస్తుంటాయి. దీంతో చాలామంది ఆందోళనకు గురవుతుంటారు. ఇలా చూసుకోవడం మంచిదైనా, అతి పనికిరాదంటున్నారు నిపుణులు. తరచూ కొలతలు చూసుకోవడం, ఒకట్రెండు పాయింట్లు అటూ ఇటూ అయితే ఆందోళన పడడం మంచిది కాదని చెబుతున్నారు. మరి, ఇంట్లోనే షుగర్ లెవల్స్, బీపీలను ఎలా చెక్ చేసుకోవాలనో ఇప్పుడు తెలుసుకుందాం!ఇంట్లోనే బీపీ చూసుకుంటున్నారా : బీపీ చెక్ చేసుకునే డిజిటల్ బీపీ మానిటర్ ఇప్పుడు ప్రతి ఇంట్లోనూ ఉంటోంది. అయితే, దాన్ని వాడడంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే, లెక్కల్లో తేడా రాకుండా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.దుస్తులపై బీపీ కఫ్ కట్టడం వల్ల రక్తపోటు సిస్టాలిక్/డయస్టాలిక్ యూనిట్లలో తేడా వస్తుందని చెబుతున్నారు.బీపీ చూసుకునే ముందు కొన్ని నిమిషాలపాటు ప్రశాంతంగా ఉండాలని, చెకింగ్ సమయంలో మాట్లాడినా 10 యూనిట్ల వరకు తేడా వస్తుందని పేర్కొంటున్నారు.చేతిని గుండెకు సమాంతరంగా ఉంచుకోవాలని, కూర్చొనే భంగిమ సక్రమంగా లేకున్నా సరే, అంకెలు మారిపోతాయని హెచ్చరిస్తున్నారు.ఆహారం తీసుకున్న 30 నిమిషాలలోపు రక్తపోటు కొలవకూడదని అధ్యయనం పేర్కొంది. ఆల్కహాల్, ధూమపానం, కెఫిన్‌లకు దూరంగా ఉండాలని తెలిపింది.వ్యాయామం, డ్రైవింగ్, స్నానం చేసిన వెంటనే బీపీ చెక్ చేసుకుంటే ఎక్కువగా చూపుతుందంటున్నారు.కచ్చితమైన బీపీ రీడింగ్ తెలుసుకునేందుకు కనీసం నిమిషం తేడాతో మూడుసార్లు బీపీని కొలవాలని పేర్కొంది. మూడు రీడింగ్‌ల సగటు లెక్కించాలని చెబుతోందిచెక్ చేసుకోవడానికి ముందు కనీసం 5 నిమిషాల పాటు విశ్రాంతి తీసుకోవాలంటున్నారు నిపుణులు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు దూరంగా ఉండాలని చెబుతున్నారు. నిద్ర సక్రమంగా లేకపోయినా బీపీ తేడా చూపుతుందని పేర్కొంటున్నారు.

# క్యాల్షియం మాత్రలతో కిడ్నీలో రాళ్లు వస్తాయా

### నిపుణులు ఏమంటున్నారంటే!
### ఎముకలు ఆరోగ్యంగా ఉండాలంటే తగినంత క్యాల్షియం తప్పనిసరి
### మరి క్యాల్షియం ట్యాబ్లెట్లు వాడితో కిడ్నీలో రాళ్లు వస్తాయనేది నిజమేనా

ఎముకల నిర్మాణానికి, కండరాలను చురుగ్గా ఉంచడంలో, నాడీ వ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో క్యాల్షియం పాత్ర అపారమైనది. అందుకే రోజుకు తగిన మొత్తంలో క్యాల్షియం తీసుకోవాలని సూచిస్తుంటారు నిపుణులు. అయితే శరీరానికి అవసరమయ్యే క్యాల్షియంను ఆహారం రూపంలో పొందలేని వారు సప్లిమెంట్స్ వాడుతుంటారు. అయితే ఈ క్రమంలోనే ఈ మాత్రలు వాడటం వల్ల కిడ్నీల్లో రాళ్లు ఏర్పడతాయనే భయంతో కొద్దిమంది వాటిని దూరం పెడుతుంటారు. అసలు ఇది నిజమేనా కిడ్నీల్లో రాళ్లు ఎందుకు ఏర్పడతాయి దీనిపై నిపుణులు ఏమంటున్నారో ఇప్పుడు చూద్దాం.



**కిడ్నీలో రాళ్లు ఎలా ఏర్పడతాయి :** రక్తంలోని మలినాలను వడగట్టడంలోనూ, శరీరంలోని ఆమ్ల, క్షార స్థాయిని నియంత్రించడంలోనూ కిడ్నీలది కీలక పాత్ర. అయితే కిడ్నీల్లో రాళ్లు ఏర్పడానికి అనేక కారణాలు ఉన్నాయని.. మరీ ముఖ్యంగా నీళ్లు తక్కువగా తాగుతున్నప్పుడు, మాంసాహారం అధికంగా తింటున్నప్పుడు, స్టెరాయిడ్‌లను ఎక్కువ మోతాదులో తీసుకున్నప్పుడు ఈ సమస్య ఎక్కువవుతుందని చెబుతున్నారు. అలాగే శరీరంలో విటమిన్ బి6, సి లోపం ఉన్నప్పుడు, విటమిన్ డి అధికంగా ఉన్నప్పుడు, మద్యం ఎక్కువగా తాగే అలవాటు ఉన్నప్పుడు కిడ్నీలో రాళ్లు వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయని వివరిస్తున్నారు. అంతేకాకుండా, వ్యాయామం చేయకపోయినా, ఒబెసిటీ ఉన్నా,డయాబెటిస్‌తో బాధపడుతున్నవారికీ కిడ్నీల్లో రాళ్లు ఏర్పడతాయని అంటున్నారు.**డయాలసిస్ చేయించుకుంటున్నారా ఏవి తినాలో ఏవి తినకూడదో తెలుసా!**

అపోహ మాత్రమే : క్యాల్షియం మాత్రలు వేసుకుంటే కిడ్నీ రాళ్లు ఏర్పడతాయని కొందరు భావిస్తుంటారు. అయితే ఇది కేవలం అపోహే అంటున్నారు సీనియర్ యూరాలజిస్ట్ డా. కె. సుబ్రహ్మణ్యం. అవసరమైనప్పుడు క్యాల్షియం మాత్రలు వేసుకోవటం తప్పనిసరని చెబుతున్నారు. లేకపోతే ఎముకలు బలహీనమై తేలికగా విరిగే ప్రమాదముంటుందని హెచ్చరిస్తున్నారు. సాధారణంగా ఎముక క్షీణించినప్పుడు (ఆస్టియోపీనియా), ఎముక గుల్లబారినప్పుడు (ఆస్టియోపోరోసిస్), ఎముక శస్త్రచికిత్సల వంటి సందర్భాల్లో నిపుణులు క్యాల్షియం మాత్రలు సూచిస్తుంటారు. ముఖ్యంగా వృద్ధులు, నెలసరి నిలిచిన మహిళల్లో ఎముకలు బలంగా ఉండటానికివి అత్యవసరమని పేర్కొంటున్నారు. అయితే కొందరు వీటితో కిడ్నీల్లో రాళ్లు ఏర్పడతాయని వేసుకోవటం మానేస్తున్నారని తెలియజేస్తున్నారు. కిడ్నీ రాళ్లు చాలా వరకూ క్యాల్షియంతో కూడుకున్నవి కావటం వల్ల ఈ అపోహకు గురవుతుంటారని.. నిజానికి క్యాల్షియం మాత్రలతో కిడ్నీలో రాళ్లేమీ ఏర్పడవంటున్నారు.“మందుల్లోని క్యాల్షియం రక్తంలో కలిసి ఎముకల్లోకి చేరుతుంది. కొంత మూత్రం ద్వారా బయటకు పోతుంది. ఇది ఎలాంటి ఇబ్బంది కలిగించదు. అయితే, ఇప్పటికే కిడ్నీ రాళ్లు ఏర్పడే అవకాశం ఉన్నవారు మాత్రం కాస్త జాగ్రత్తగా ఉండాలి. వీరికి మూత్రంలోకి చేరుకున్న క్యాల్షియం, మూత్రపిండాల్లో పోగుపడి రాళ్లు ఏర్పడే అవకాశం పెరగొచ్చు. ఇలాంటి వారు మందుల కన్నా పాలు, పెరుగు, చీజ్, రాగుల లాంటి ఆహార పదార్థాల ద్వారా క్యాల్షియం లభించేలా చూసుకోవటం మంచిది”- **డా. కె. సుబ్రహ్మణ్యం, సీనియర్ యూరాలజిస్ట్**

**నీరు ఎక్కువగా :** ఒకవేళ క్యాల్షియం మందులు తప్పనిసరిగా వేసుకోవాల్సి వస్తే కాస్త ఎక్కువగా నీరు తాగాలంటున్నారు. అలాగే, విటమిన్ డి తగినంత లభించేలా చూసుకోవాలని పేర్కొంటున్నారు. ఇది శరీరం క్యాల్షియాన్ని సంగ్రహించుకోవటానికి తోడ్పడుతుందని పేర్కొంటున్నారు. దీంతో మూత్రంలో క్యాల్షియం పోగుపడకుండా చూసుకోవచ్చని తెలియజేస్తున్నారు. రాళ్లు ఏర్పడే స్వభావం లేనివారికైతే మాత్రలతో ఎలాంటి ఇబ్బందీ ఉండదని చెబుతున్నారు. కాకపోతే భోజనం చేసిన వెంటనే లేదా భోజనంతో పాటు క్యాల్షియం మాత్రలు వేసుకోవటం, కాస్త ఎక్కువ నీరు తాగటం మంచిదని సూచిస్తున్నారు.ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

### బ్లాక్‌కాఫీ‘గుండె’కుమంచిదేనా

# అధ్యయనాలు ఏం చెబుతున్నాయంటే!

### బ్లాక్ కాఫీతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు
### మితంగా తీసుకోవాలంటున్న నిపుణులు!



ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన పానీయాలలో బ్లాక్ కాఫీ ఒకటి. పాలు, చక్కెర లేకుండా తయారుచేసే ఈ పానీయం గుండె ఆరోగ్యానికి మంచిదా కాదా అనే సందేహం చాలామందిలో ఉంటుంది. పరిమితంగా తీసుకుంటే ఇది మెటబాలిజం పెంచడానికి, ఆకలిని తగ్గించడానికి సహాయపడుతుందంటున్నారు నిపుణులు. కానీ, కొందరిలో దుష్ప్రభావాలు కూడా ఉండవచ్చని హెచ్చరిస్తున్నారు. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!గుండెపై తక్షణ ప్రభావాలు : కొంతమందిలో బ్లాక్ కాఫీలోని కెఫీన్ ఒక ఉత్తేజితంలా పనిచేసి, రక్తపోటు, హృదయ స్పందన రేటును తాత్కాలికంగా పెంచుతుందంటున్నారు నిపుణులు. రోజూ కాఫీ తాగని వారిలో ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తుందని చెబుతున్నారు. కెఫిన్ తాగడం వల్ల నోరాడ్రినలిన్, నోర్‌పైన్‌ఫ్రైన్ విడుదల అవుతుంది, ఇది కొంతమంది వ్యక్తులలో హృదయ స్పందన రేటు, రక్తపోటును పెంచుతుందని అధ్యయనం పేర్కొంది.

**చలికాలంలో “గుండెపోటు”కు కారణాలివే!**

**వైద్య నిపుణులు ఏం చెప్తున్నారంటే!**


దీర్ఘకాలిక ప్రభావాలు : బ్లాక్ కాఫీలో ఉండే పాలీఫెనాల్స్, యాంటీఆక్సిడెంట్లు శరీరంలో వేడిని ఉత్పత్తి చేసి (%ష్ట్రవతీఎశీస్త్రవఅవ-ంఱం%), శక్తి వినియోగాన్ని పెంచి బరువు తగ్గడానికి తోడ్పడతాయంటున్నారు నిపుణులు. **గుండె ఆరోగ్యం :** రోజుకు 2-3 కప్పుల బ్లాక్ కాఫీ తాగడం వల్ల దీర్ఘకాలంలో గుండె వైఫల్యం, స్ట్రోక్, కొరోనరీ ఆర్టరీ వ్యాధుల ముప్పు తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.గుండె ఆరోగ్యంపై సానుకూల ప్రభావం : మితంగా తాగడం వల్ల రక్తపోటు, గుండె వైఫల్యం, గుండె లయ తప్పడం (ఏట్రియల్ ఫిబ్రిలేషన్)వంటి సమస్యలు తగ్గుతాయని అధ్యయనం పేర్కొంది. బ్లాక్ కాఫీలోని యాంటీ ఆక్సిడెంట్లు మంటను తగ్గించి, రక్తనాళాల పనితీరును మెరుగుపరుస్తాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో మీకు అధిక రక్తపోటు లేకపోతే, రోజుకు 400 మిల్లీగ్రాములు కెఫీన్ తీసుకోవడం చాలా మంది పెద్దలకు సురక్షితమనిఅధ్యయనం పేర్కొంది.బ్లాక్ కాఫీ వల్ల గుండె ఆరోగ్యంతో పాటు మెదడు చురుకుగా ఉంటుంది. ఇందులో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ అనేవి బరువు నియంత్రణలో ఉంటుంది. రోజుకు కనీసం 80 మి.గ్రా నుంచి 100 మి.గ్రా బ్లాక్ కాఫీని తీసుకోవడం అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. కానీ, పరిమితికి మించి తీసుకుంటే అనారోగ్య సమస్యలు వస్తాయి. - శ్రావ్య, డైటీషియన్ప్రతికూల ప్రభావాలు : తీవ్రమైన అధిక రక్తపోటు (160/100 లేదా అంతకంటే ఎక్కువ) ఉన్నవారు.. రోజుకు రెండు లేదా అంతకంటే ఎక్కువ కప్పుల కాఫీ తాగడం వల్ల హృదయ సంబంధ వ్యాధుల వల్ల మరణించే ప్రమాదం రెట్టింపు కావచ్చని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ అధ్యయనం హెచ్చరిస్తోంది. వడకట్టని లేదా ఉడకబెట్టిన కాఫీలో ‘డైటెర్పెనెస్’ అనే పదార్థాలు ఉంటాయని, ఇవి చెడు కొలెస్ట్రాల్ (%బాణూ%)ను పెంచుతాయంటున్నారు నిపుణులు.బ్లాక్ కాఫీని సురక్షితంగా తాగడం ఎలా : ఆరోగ్యవంతులు రోజుకు 2 నుంచి 4 కప్పుల కాఫీ తాగడం సురక్షితమంటున్నారు నిపుణులు. కానీ, రక్తపోటు, గుండె సమస్యలు ఉన్నా లేదా గర్భవతి అయినా.. బ్లాక్ కాఫీ పరిమితి గురించి వైద్యుడిని సంప్రదించడం మంచిదని సూచిస్తున్నారు. సాధారణంగా ఆరోగ్యవంతులకు రోజుకు 400 మి.గ్రా కెఫీన్ గరిష్ట పరిమితిగా తీసుకోవాలని సలహా ఇస్తున్నారు. ఈ క్రమంలో చక్కెర, పాలు లేకుండా బ్లాక్ కాఫీని మితంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి, గుండెకు మేలు జరుగుతుందని పేర్కొంటున్నారు. ఇక్కడ మీకు అందించిన సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# ఆహారం ఎన్నిసార్లు నమలాలి

### తినేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి
### ఏదో ఒకటి తినేస్తామంటే కుదరదంటున్న నిపుణులు
### ఏం తింటున్నారో.. ఎలా తింటున్నారో తెలుసుకోవాలని సూచన!

ఏం తినాలో, ఎంత తినాలో, ఎప్పుడు తినాలో తెలియాలంటున్నారు నిపుణులు. ఆహారం ఎలా తినాలో కూడా తెలిస్తేనే ఆరోగ్యంగా ఉంటారట. కానీ.. నూటికి 90 మంది ఆహార సూత్రాల విషయంలో అలసత్వం వహిస్తున్నారని చెబుతున్నారు. అందుకే, భోజనం చేసేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచిస్తున్నారు.ఎక్కడ కూర్చుంటున్నాం : తినడంలో క్రమశిక్షణ చాలా అవసరం. ప్రస్తుతం చాలా మంది ఫోన్, టీవీ, ల్యాప్‌టాప్ చూస్తూ, లేదంటే వేరే పని చేసుకుంటూ తింటున్నారు. ఇలా ఆదరాబాదరగా లాగించడం ఏ మాత్రం మంచిది కాదంటున్నారు. ఆహారాన్ని ప్రశాంతంగా, ఆస్వాదిస్తూ తినాలని చెబుతున్నారు. మన పూర్వీకులు నేల మీద కూర్చొని తినే వాళ్లు. తర్వాత పీట, ఆ తర్వాత డైనింగ్ టేబుల్, ఇప్పుడు నుంచొని తినడానికి అలవాటుపడ్డారు. ఇది ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. నేల మీద కూర్చున్నప్పుడు ముద్ద నోట్లో పెట్టుకోవడానికి ముందుకు వంగినప్పుడు.. పొట్టపై కొంత ఒత్తిడిపడి తిన్నది సరిపోయిందా లేదా అనేది శరీరం చెప్పేస్తుందని తెలియజేస్తున్నారు. అలాగే, కింద కూర్చోవడం వల్ల కాళ్లపై ఒత్తిడి పడి పొట్టకు రక్త సరఫరా పెరుగుతుందని, జీర్ణశక్తి మెరగవుతుందని వివరిస్తున్నారు.

**దిండ్లు, దుప్పట్లను సరిగా శుభ్రం చేయట్లేదా**



**ఈ ఆరోగ్య సమస్యలు ఇబ్బంది పెట్టే అవకాశమట!**

**పొట్టను నింపేయొద్దు! :** జీర్ణాశయాన్ని మూడు భాగాలుగా భావించి రెండు భాగాలే ఆహారం తీసుకోవాలంటున్నారు నిపుణులు. మిగతాది ఖాళీగా ఉంచాలని సూచిస్తున్నారు.చాలామంది భోజనం చేసిన వెంటనే మళ్లీ ఏదో ఒక చిరుతిండి తింటారు. ఇలా చేయడం ఉడుకుతున్న అన్నంలో బియ్యం వేయడం లాంటిదని పేర్కొంటున్నారు.కొందరు అన్నం పూర్తిగా తిన్నాక ఒకేసారి నీళ్లు తాగుతుంటారు. దానికన్నా భోజనం చేసేటప్పుడు కొద్దికొద్దిగా నీళ్లు తాగడం మేలని సూచిస్తున్నారు.భోజనం చేసిన తర్వాత 3-4 గంటల విరామం ఇవ్వాలి. ఆ తర్వాతే మళ్లీ ఏదో ఒకటి తినాలని సలహా ఇస్తున్నారు.

**రాత్రి భోజనాన్ని వీలైనంత త్వరగా ముగించాలని అంటున్నారు.**

సమయానికి ఆకలి, దాహం, రుచి లేని తేన్పులు రావటం, మల విసర్జన సాఫీగా కావడం.. ఈ లక్షణాలన్నీ ఆహారం సరిగా జీర్ణమవుతోందనడానికి సూచనలని చెబుతున్నారు.మనలో ఎక్కువ మంది పెద్ద ప్లేట్‌లో అన్నం పెట్టుకుని ఏదో ఓ మూల కొంచెం కూర వేసుకుంటాం. అలాకాకుండా



కంచాన్ని నాలుగు భాగాలు చేసుకోవాలి. 50% కూరగాయలు, ఆకుకూరలు, సలాడ్‌లు ఉండాలి. మిగతా 25% ప్రొటీన్, 15% కార్బోహైడ్రేట్లు ఉండేలా చూసుకోవాలి. అప్పుడే, దాన్ని హెల్దీ ప్లేట్ అంటారు- వినీత మామిళ్ల, పోషకాహార నిపుణురాలుగు టుక్కుమనించొద్దు : ముద్ద పెట్టుకోగానే చాలామంది గుటుక్కున మింగుతారు. అలా కాకుండా కనీసం 15-20 సార్లు నమిలి మింగాలంటున్నారు నిపుణులు. అలాగని లెక్కపెట్టుకోలేవ ంనుకుంటే, ఆహారం ద్రవరూపంలోకి మారే దాకా నమలాలని చెబుతున్నారు. ఇలా చేస్తే సగం నోట్లోనే జీర్ణమయ్యి పొట్ట మీద భారం తగ్గుతుందని పేర్కొంటున్నారు. సరిగ్గా నమలకపోవడం వల్ల తిన్నది జీర్ణం కావడానికి చాలా సమయం పడుతుందని తెలియజేస్తున్నారు. కచ్చాపచ్చాగా నమిలిన ఆహారం ఎక్కువ సేపు కడుపులో ఉండటంతో పుల్లటి తేన్పులు, గ్యాస్ట్రిక్ సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. చాలా వేగంగా తినడం వల్ల అజీర్ణం, గుండెల్లో మంట కూడా వస్తుందని అధ్యయనం పేర్కొంది. వేగంగా తినడం వల్ల గాలి మింగడం జరుగుతుందని, దీనివల్ల ఉబ్బరం, గ్యాస్, అసౌకర్యం కలుగుతాయని పేర్కొంది. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య, మానసిక నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# క్రెడిట్ కార్డు” వాడుతున్నారా

**ఈ “ఐదు” పొరపాట్లు చేస్తే భారీగా నష్టపోతారు జాగ్రత్త**

**క్రెడిట్ కార్డుతో ‘ఇలాంటి పేమెంట్లు’ చేస్తున్నారా**

**అయితే, జాగ్రత్త పడాల్సిందే అంటున్న నిపుణులు**




ప్రస్తుత రోజుల్లో క్రెడిట్ కార్డుల వాడకం కామన్ అయిపోయింది. అయితే, వీటిని సరైన పద్ధతిలో ఉపయోగించుకున్నట్లయితే అత్యవసర పరిస్థితుల్లో మంచి ఆర్థిక సాధనంగా ఉపయోగపడతాయి. అలాగే, రివార్డ్స్, క్యాష్ బ్యాక్, డిస్కౌంట్?లు పొందుతారు. అలాకాకుండా అనవసర ఖర్చుల కోసం క్రెడిట్ కార్డులను వాడితే మిమ్మల్ని అప్పుల ఊబిలోకి నెడుతుందని గుర్తుంచుకోవాలంటున్నారు నిపుణులు. ఈ క్రమంలోనే క్రెడిట్ కార్డులు ఉన్నవారు చేయకూడని కొన్ని ముఖ్యమైన తప్పులను వివరిస్తున్నారు. మరి, అవేంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం.క్రెడిట్ కార్డు ఉంటే చిన్న చిన్న పేమెంట్స్ నుంచి అన్ని రకాల పేమెంట్స్ దానితోనే చేయొచ్చా? అలా చేస్తే వచ్చే ఇబ్బందులేమిటి? అసలు క్రెడిట్ కార్డుతో ఎలాంటి పేమెంట్స్ చేయకపోవడం మంచిదో ఆర్థిక నిపుణులు ఇలా వివరిస్తున్నారు.క్రెడిట్ కార్డు ఉపయోగించి ఏటీఎం నుంచి మనీ విత్?డ్రా చేయకపోవడం మంచిదంటున్నారు నిపుణులు. ఎందుకంటే డబ్బులు విత్?డ్రా చేసిన రోజు నుంచి వడ్డీ పడుతుంది. ఇది నెలకు 2.5శాతం నుంచి 3.99శాతం వరకు ఉండొచ్చు. దీనితో పాటు సాధారణంగా 2.5శాతం నుంచి 3శాతం వరకు లేదా కనీసం రూ.300 నుంచి 500 రూపాయల వరకు క్యాష్ అడ్వాన్స్?డ్ ఛార్జీలు కూడా ఉంటాయి. వీటిపై అదనంగా జీఎస్టీ కూడా చెల్లించాలి. ఇవన్నీ కలిపితే మీరు తిరిగి చెల్లించే మొత్తం భారీగా ఉంటుందని గుర్తుంచుకోవాలంటున్నారు.కిరాణా సామాను, రెస్టారెంట్లు, జనరల్ పేమెంట్లకు క్రెడిట్ కార్డు వాడితే మీకు తెలియకుండానే ఎక్కువ ఖర్చు చేసే ఛాన్స్ ఉంటుందంటున్నారు నిపుణులు. ఇలాంటి వాటికోసం వీలైనంత వరకు హ్యాండ్ క్యాష్ వాడడం మంచిదంటున్నారు. ఒకవేళ లిక్విడ్ క్యాష్ లేకపోతే డెబిట్ కార్డులు ఉపయోగించడం బెటర్. దీని వల్ల నెలవారీ బడ్జెట్?ను కూడా లిమిట్?లో పెట్టుకోవచ్చని సూచిస్తున్నారు.విదేశాలకు వెళ్లినప్పుడు ప్రతి ఖర్చుకు క్రెడిట్ కార్డు యూజ్ చేయడం అంత సేఫ్ కాదని నిపుణులు అంటున్నారు. హోటల్ బిల్లులు, ఎమర్జెన్సీ ఖర్చులకు మాత్రమే క్రెడిట్ కార్డులు వాడడం బెటర్ అని చెబుతున్నారు. ఎందుకంటే చాలా క్రెడిట్ కార్డులపై ఇంటర్నేషనల్ ట్రాన్సక్షన్లకు 2 నుంచి 3.5 శాతం వరకు ఫారెక్స్ మార్కప్(కరెన్సీ మార్పిడి) ఛార్జీలు ఉంటాయి. దీనికి బదులుగా ప్రీపెయిడ్ కరెన్సీ కార్డులు, లోకల్ కరెన్సీలో చెల్లించడం బెస్ట్ ఛాయిస్ అంటున్నారు .కెడిట్ కార్డుతో పేమెంట్ చేస్తే సాధారణంగా 20 నుంచి 50 రోజుల వరకు వడ్డీ ఉండదు. ఈ టైమ్?లో బిల్లు పూర్తిగా క్లియర్? చేయలేకపోతే బ్యాంకులు లేట్ ఫీజును వసూలు చేస్తాయి. అదనంగా నెలకు 2.5శాతం నుంచి 3.99 శాతం వరకు వడ్డీ కూడా పడుతుంది. బిల్లు పూర్తిగా చెల్లించకపోతే ట్రాన్సక్షన్ తేదీ నుంచి వడ్డీ లెక్కించే చేసే అవకాశం ఉంటుంది. అందుకే, మీరు టైమ్?కు రీపే చేస్తాము అనుకుంటేనే క్రెడిట్ కార్డు వాడడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.ఇక ప్రస్తుతం చాలా మంది ఒక్క క్రెడిట్ కార్డు మీద ఆధారపడ్డేదు. అనేక బ్యాంకులకు సంబంధించిన కార్డులను వాడుతున్నారు. అయితే, ఒకటికి మించి ఎక్కువ కార్డులను వాడడం వల్ల వాటి బకాయిలు కూడా విపరీతంగా పెరిగే ఛాన్స్ ఉంటుందంటున్నారు నిపుణులు. దాంతో గడువు లోపు చెల్లింపులు చేయడం సాధ్యం కాకపోవచ్చంటున్నారు. అలాగే, కార్డులు పెరిగే కొద్ది కొన్ని చెల్లింపులు, వాటి తేదీలను మరిచిపోయే ఛాన్స్ కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. అందుకే, వినియోగించే కార్డుల సంఖ్యను లిమిట్?గా ఉంచుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు

# పీఎఫ్ ఖాతాకు “నామినీ” యాడ్ చేశారా

**లేదంటే ప్రయోజనాలు నష్టపోతారు!**

**మీకు ‘పీఎఫ్ అకౌంట్’ ఉందా**


**నామినీ యాడ్ చేయకపోతే ఇప్పుడే ఆ ప్రాసెస్ కంప్లీట్ చేయండిలా**




ఉద్యోగం చేసే ప్రతి ఒక్కరికీ దాదాపు ‘ఈపీఎఫ్ ఖాతా’ ఉంటుంది. ఈ అకౌంట్‌లను ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ నిర్వహిస్తుంటుంది. అయితే, పీఎఫ్ అకౌంట్ ఉన్నవారిలో చాలా మంది తమ ఖాతాకు నామినీ పేరును యాడ్ చేయడం మర్చిపోతుంటారు. నార్మల్‌గా మనం కొత్తగా బ్యాంక్ అకౌంట్ తీసినా, ఇన్సూరెన్స్ పాలసీ కొనుగోలు చేసినా నామినీ పేరును పేర్కొనడం తప్పనిసరి. ఈ నామినీ ప్రక్రియ అనేది మన తదరనంతరం మన సొమ్ము ఎవరికి చెందాలో ముందుగా చెప్పే ఒక వీలునామా వంటిదని చెప్పుకోవచ్చు.మీకూ పీఎఫ్ అకౌంట్ ఉండి, నామినీ ఇంకా యాడ్ చేయలేదా అయితే, ఇప్పుడే ఆ పని పూర్తి చేయండి. లేదంటే ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ అందించే ఈ 3 పథకాల బెనిఫిట్స్ కోల్పోయే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. ఇంతకీ, పీఎఫ్ ఖాతాకు నామినీ యాడ్ చేయకపోవడం వల్ల నష్టపోయే ఆ 3 స్కీమ్స్ ఏంటి ఈపీఎఫ్ఓ కార్యాలయాన్ని సందర్శించకుండా మీరే ఆన్‌లైన్‌లో ఈ-నామినేషన్ ఎలా పూర్తి చేసుకోవచ్చో ఈ స్టోరీలో తెలుసుకుందాం.మీ పీఎఫ్ ఖాతాకు నామినీ జత చేయకపోవడం వల్ల నష్టపోయే మూడు పథకాలేంటంటే, ప్రావిడెండ్ ఫండ ఈపీఎస్ పెన్షన్ రూ.7లక్షల వరకు ఉచిత బీమా మీకు భవిష్యత్తులో ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు పైన పేర్కొన్న మూడు పథకాలకు సంబంధించిన బెనిఫిట్స్ ఎలాంటి ఇబ్బందులూ లేకుండా మీ ఫ్యామిలీ మెంబర్స్‌కు అందడానికి ఈ-నామినేషన్ ఎంతగానో సహాయపడుతుం దంటున్నారు నిపుణులు. మీరు ఇది వరకే నామినీ వివరాలు ఇచ్చినప్పటికీ, ఒకవేళ పెళ్లై ఉంటే మీ భాగస్వామి, పిల్లల వివరాలు ఇవ్వడం కూడా ముఖ్యమని గుర్తుంచుకోవాలి.

# ప్రభుత్వానికి కోటి రూపాయలు పన్ను చెల్లించా

**ఉద్యోగం పోయిన తర్వాత నా బతుకు ఎలా ఉందంటే**



14 ఏళ్లలో కోటి రూపాయల పన్ను చెల్లించానని.. ఉద్యోగం కోల్పోయిన తర్వాత ఎలాంటి నాకు మద్దతు లభించలేదని ఉద్యోగి సోషల్ మీడియాలో పంచుకున్న ఆవేదన వైరల్ అవుతోంది. భారతదేశంలో పన్ను చెల్లింపుదారులకు లభించే సామాజిక భద్రత ప్రభుత్వ సౌకర్యాలపై సోషల్ మీడియాలో జరుగుతున్న ఒక ఆసక్తికరమైన చర్చ ఇదని చెప్పుకోవచ్చు. తన 14 ఏళ్ల కెరీర్‌లో దాదాపు రూ. 1 కోటి వరకు ఆదాయపు పన్ను చెల్లించిన మహమ్మద్ నౌసత్ అనే నిపుణుడు.. తాను ఉద్యోగం కోల్పోయిన సమయంలో ప్రభుత్వం నుండి ఎలాంటి మద్దతు లభించకపోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ భృతి లభించకపోగా.. తన ఉద్యోగ విరమణ పరిహారంపై కూడా పన్ను విధించడం పట్ల ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వేసిన ప్రశ్నలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా సామాజిక భద్రత, పన్ను విధానాలపై పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. నౌసత్ ప్రతిపాదన ప్రకారం.. క్లిష్ట సమయంలో పన్ను చెల్లింపుదారులకు కనీసం 3 నుండి 6 నెలల పాటు పన్ను మినహాయింపుతో కూడిన వేతనం లేదా వారు చెల్లించిన పన్నులలో కొంత భాగాన్ని ఆర్థిక సాయంగా అందించే వ్యవస్థ ఉండాలి. కెనడా, ఫ్రాన్స్, యూకే, ఆస్ట్రేలియా వంటి అభివృద్ధి చెందిన దేశాలలో నిరుద్యోగ సమయాల్లో పౌరులకు లభించే ఆర్థిక సహాయాన్ని ఈ సందర్భంగా పలువురు యూజర్లు ప్రస్తావించారు. ఆయా దేశాలతో పోలిస్తే.. భారతదేశంలో అధిక పన్నులు చెల్లిస్తున్నప్పటికీ పన్ను చెల్లింపుదారులకు తిరిగి లభించే ప్రతిఫలాలు లేదా భద్రత శూన్యమని విమర్శకులు వాదిస్తున్నారు.వ్యవసాయ భూమి అమ్మితే పన్ను పడుతుందా.. గ్రామీణ, పట్టణ భూములపై పన్ను నిబంధనలు ఎలా ఉంటాయి.. అయితే ఈ అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అత్యవసర నిధులు సిద్ధం చేసుకోవడం, పన్నులు ఆదా చేసుకునేందుకు వంటి సౌకర్యాలను ఉపయోగించుకోవడం అనేది పూర్తిగా వ్యక్తిగత బాధ్యత అని కొందరు నెటిజన్లు అభిప్రాయపడ్డారు. దీనికి సమాధానంగా నౌసత్ విమర్శకులకు గట్టి కౌంటర్ ఇచ్చారు. నిరుద్యోగ సమయంలో ఆర్థిక సహాయం ఇవ్వడం కుదరకపోతే.. కనీసం చెల్లిస్తున్న పన్నులకు ప్రతిఫలంగా పిల్లలు ఆడుకోవడానికి పచ్చని ప్రదేశాలు, సురక్షితమైన ఫుట్‌పాత్‌లు, మెరుగైన రహదారులు, రవాణా సౌకర్యాలు వంటి ప్రాథమిక ప్రజా మౌలిక సదుపాయాలనైనా నాణ్యంగా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటన భారతదేశంలో పన్ను చెల్లింపుదారులు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను, సామాజిక భద్రతా వ్యవస్థ ఆవశ్యకతను మరొకసారి తెరపైకి తెచ్చింది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# సంపాదిస్తే సరిపోదు గురూ

**పొదుపు కూడా చేయాలి**




మధ్య తరగతి వ్యక్తి కోటీశ్వరుడు కావాలంటే ఏం చేయాలి అంటే సంపాదించాలని చెబుతాం. అయితే సంపాదన ఒక్కటే కాదు ఆ డబ్బును పొదుపు చేస్తేనే కోటీశ్వరుడు అవుతారని బెంగళూరుకు చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ మీనాల్ గోయెల్ చెబుతున్నారు. నీకు ఎంత జీతం వచ్చినా.. పొదుపు లేకుంటే కోటీశ్వరుడు కావడం సాధ్యం కాదని వివరిస్తున్నారు. ఆర్థిక క్రమ శిక్షణ, ఖర్చుల నియంత్రణ, దీర్ఘకాలిక పెట్టుబడులే అసలైన సంపదకు మార్గమని పేర్కొన్నారు. ఆమె లింక్డ్ఇన్‌లో కొన్ని సలహాలు ఇచ్చారు. తన కెరీర్ ఆరంభంలో కోటి సంపాదిస్తేనే ధనవంతురాలినని అనుకునేదాన్ని అని గుర్తు చేశారు. అయితే ఆ తర్వాత అనుభం పెరిగే కొద్దీ ధనవంతులు ఎవరు అవుతారని ఒక ఐడియా వచ్చిందని వివరించారు. సంపాదించిన దాంట్లో ఎంత పొదుపు చేస్తున్నామనేది కీలకమని స్పష్టం చేశారు. చాలా మందికి ఆదాయం పెరిగే కొద్దీ ఖర్చు కూడా పెరుగుతుందని చెప్పారు. ఇది చాలా మందికి సమస్యగా ఉంటుందని పేర్కొన్నారు. కొంత మంది జీతం పెరిగితే.. వారు అధిక రెంట్ ఉన్న ఇంట్లోకి మారుతారు. లేదంటే ఈఎంఐపై కార్లు కొనుగోలు చేస్తారు. రెగ్యులర్ గా బయట తినడం చేస్తారు. లైఫ్ స్టైల్ ను మారుస్తారు. దీని వల్ల ఎలాంటి మార్పు ఉండదని చెబుతున్నారు. ఆమె ఒక ఉదాహరణతో ప్రస్తావించారు. సంవత్సరానికి రూ.50 లక్షలు సంపాదించే సాఫ్ట్ వేర్ ఉద్యోగుల కంటే సంవత్సరానికి రూ.12 లక్షలు జీతం వచ్చే ప్రభుత్వ ఉద్యోగులే ఎక్కువ పొదుపు చేస్తారని చెప్పారు. ఖర్చులో నియంత్రణ ఉంటేనే పొదుపు చేయగలుగుతామని స్పష్టం చేశారు. రెగ్యులర్ గా పొదుపు చేయడం, పథకాల్లో పెట్టుబడులు కొనసాగించడం, జీతం పెరిగినప్పుడు కొంత భాగాన్ని పక్కకు పెట్టడం వంటి చేయాలన్నారు. దాదాపు 10 శాతం వార్షిక జీతం పెరుగుదలతో పాటు దీర్ఘకాలంలో సగటున 12-15 శాతం పెట్టుబడి రాబడిని సాధించగలిగితే, పదేళ్ల వ్యవధిలో కోటి రూపాయల పెట్టుబడి విలువను చేరుకోవడం సాధ్యమేనని చెప్పారు. జీతం పెరిగిన వెంటనే ముందుగా ఎస్ఐపీ, పీఎఫ్, ఎన్‌పీఎస్ లేదా ఇతర దీర్ఘకాలిక పెట్టుబడుల్లో వాటాను పెంచాలని ఆమె చెబుతున్నారు. సాధారణంగా అత్యవసర నిధి, తగిన బీమా, క్రమబద్ధమైన పెట్టుబడులు, అవసరం లేని రుణాలకు దూరంగా ఉండటం ద్వారా దీర్ఘకాలంలో గణనీయమైన సంపదను సృష్టించవచ్చని వివరిస్తున్నారు.

# స్టాక్ మార్కెట్ ఈ రోజు ఎందుకు కుప్పకూలింది

**షేర్ల పతనం వెనుక మూడు ప్రధాన కారణాలు ఇవే**



వారాంతాన్ని లాభాలతో ముగించిన భారత స్టాక్ మార్కెట్ కొత్త వారం ప్రారంభంలోనే భారీ ఒత్తిడితో విలవిలలాడింది. సెన్సెక్స్ 700 పాయింట్లకు పైగా పడిపోగా, నిఫ్టీ 24,200 దిగువకు చేరి పెట్టుబడిదారులను వణికించింది. అంతర్జాతీయ పరిణామాలు, పెరిగిన ముడి చమురు ధరలు, బ్యాంకింగ్ రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కలిసి మార్కెట్ సెంటిమెంట్‌ను నేడు తీవ్రంగా దెబ్బతీశాయి. సోమవారం భారత ఈక్విటీ మార్కెట్లు తీవ్రమైన అమ్మకాల ఒత్తిడికి గురై పలు రంగాల షేర్లు భారీగా నష్టాల్లోకి జారుకున్నాయి. ప్రధాన సూచీలైన బీఎస్ఈ సెన్సెక్స్ 707 పాయింట్లు లేదా 0.9 శాతం క్షీణించి 77,444.79 వద్ద ముగియగా.. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 కీలకమైన 24,200 స్థాయి దిగువకు జారి 0.8 శాతం నష్టంతో 24,149.90 వద్ద స్థిరపడింది. దేశీయ సూచీల పతనానికి ప్రధానంగా అంతర్జాతీయ పరిణామాలు, ముడి చమురు ధరల మంట, దిగ్గజ బ్యాంకింగ్ షేర్లలో వ్యక్తమైన నిరాశజనక ప్రదర్శన కారణమయ్యాయని చెప్పవచ్చు. ఈ పతనంలో మొదటి అంశం పశ్చిమ ఆసియాలో మళ్లీ తీవ్రమైన సైనిక ఘర్షణలు. అక్కడ ఉద్రిక్తతలు పెరగడంతో సరఫరా అడ్డంకుల భయాల మధ్య అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధర దాదాపు 4 శాతం ఎగబాకి బ్యారెల్‌కు వి91 డాలర్ల పైచిలుకు స్థాయికి చేరింది. జూన్ మధ్యకాలం తర్వాత చమురు ధరలలో ఇదే అత్యధిక స్థాయి కావడం.. దీనివల్ల ద్రవ్యోల్బణం మళ్లీ పెరిగి దేశీయ ఆర్థిక వ్యవస్థపై భారం పడుతుందనే ఆందోళనలు పెట్టుబడిదారులను కుదిపేశాయి. ూాశ్రీంశీ =ఋఞ కుప్పకూలిన దీవీ షేర్లు.. ఒక్కరోజులో 70 బిలియన్ డాలర్ల సంపద ఆవిరి.. 58 ఏళ్లలో ఇంత భారీ పతనం వెనుక కారణం ఇదే.. రెండవ కారణం ఆసియా మార్కెట్ వ్యాప్తంగా కనిపించిన బలహీనత. గ్లోబల్ సెంటిమెంట్ దెబ్బతినడంతో జపాన్ నిక్కీ సూచీ అత్యధికంగా 4.03 శాతం, దక్షిణ కొరియా కోస్పి 3.96 శాతం మేర కుప్పకూలాయి. ఈ అంతర్జాతీయ బలహీన సంకేతాలు భారత మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత ప్రతికూలంగా మార్చాయి. వీటికి తోడు శనివారం జూన్ త్రైమాసిక ఫలితాలను వెల్లడించిన బ్యాంకింగ్ దిగ్గజాలు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు విపరీతమైన అమ్మకాల ఒత్తిడికి లోనై మార్కెట్‌ను కిందకు లాగాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఫలితాల్లో నికర వడ్డీ మార్జిన్ 12 బేసిస్ పాయింట్లు తగ్గి 3.26 శాతానికి పడిపోవడంతో పాటు స్థూల, నికర నిరర్థక ఆస్తులు పెరగడంతో ఆ షేరు 5.1 శాతం పడిపోయి రూ. 777.50 వద్ద ముగిసింది. అలాగే యాక్సిస్ బ్యాంక్ విషయంలో నికర వడ్డీ మార్జిన్లు 16 బేసిస్ పాయింట్లు తగ్గడం తో ఈ బ్యాంక్ షేరు ఏకంగా 6 శాతం క్షీణించి రూ. 1,249.05 కి చేరింది. ఈ మూడు ప్రధాన అంశాలు కలసి సోమవారం నాటి మార్కెట్ పతనానికి ప్రధాన కారణమయ్యాయి. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# ఇక నుంచి ఇన్ స్టా మార్ట్ లో సిలిండర్ డెలివరీ




ప్రముఖ క్విక్-కామర్స్ ప్లాట్‌ఫామ్ అయిన స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, మహారత్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. క్విక్-కామర్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా భారతదేశపు మొట్టమొదటి ఆన్ డిమాండ్ సిలిండర్ డెలివరీ సేవలను ప్రారంభించింది. ఈ భాగస్వామ్యంతో అత్యవసర గృహ వినియోగ వస్తువును తక్షణ డెలివరీ వ్యవస్థలోకి తీసుకువస్తుంది. ఇన్‌స్టామార్ట్‌లో న్యూజా కొత్తగా ప్రవేశపెట్టిన నవ్య 10 కేజీల కాంపోజిట్ సిలిండర్ డెలివరీ చేయనున్నారు. ఈ సేవలు మొదట బెంగళూరులో అందుబాటులోకి రానున్నాయి. ఈ సేవ ద్వారా ఆధునిక గృహాల కోసం రూపొందించిన నెక్స్ట్ జనరేషన్ కాంపోజిట్ ఎల్పీజీ సిలిండర్ అయిన నవ్యను ఆర్డర్ చేయవచ్చు. ఈ సిలిండర్ తేలికైనది, తుప్పు కూడా పట్టదు. మెరుగైన భద్రతా ఫీచర్లతో కూడి ఉంటుంది. ఈ కాంపాక్ట్ డిజైన్.. అపార్ట్‌మెంట్లు, చిన్న కుటుంబాలు, ఉద్యోగస్తులు, విద్యార్థులు, సౌకర్యవంతంగా ఉంటుంది. హెచ్పీ నవ్యతో పాటు, ఇన్‌స్టామార్ట్ హెచ్పీసీఎల్ 5 కేజీల మెటల్ న్యూ+ సిలిండర్‌ను కూడా అందిస్తుంది. స్విగ్గీ, ఇన్‌స్టామార్ట్, హెచ్పీసీఎల్ భాగస్వామ్యంతో సిలిండర్ డెలివరీని ఇప్పటికే ప్రారంభించింది. ఈ సిలిండర్ ఆర్డర్ చేయడానికి వినియోగదారులకు ఇప్పటికే గృహ కనెక్షన్ ఉండాల్సిన అవసరం లేదు. మొదటిసారి చేసే కొనుగోళ్లను కొత్త సిలిండర్ కొనుగోళ్లుగా పరిగణిస్తారు. అయితే తదుపరి ఆర్డర్‌లు రీఫిల్ అభ్యర్థనలుగా పనిచేస్తాయి, డెలివరీ సమయంలో వినియోగదారులు ఖాళీ హెచ్పీసీఎల్ సిలిండర్‌ను తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. ఇన్‌స్టామార్ట్ ద్వారా చేసిన ఆర్డర్‌లను హెచ్పీసీఎల్ అధీకృత పంపిణీదారుల నెట్‌వర్క్ ద్వారా పంపిణీ చేస్తారు. మొదటిసారి కొనుగోలు చేసేవారి గుర్తింపు ధృవీకరణ జరుగుతుంది. ఇన్‌స్టామార్ట్ తన వినియోగ సందర్భాలను కిరాణా వస్తువులకు మించి విస్తరించి, రోజువారీ జీవితంలో ఒక భాగంగా మారిందని ఇన్‌స్టామార్ట్ సీఈఓ అమితేష్ ఝా తెలిపారు. 131కి పైగా నగరాల్లో 50,000కు పైగా స్టాక్-కీపింగ్ యూనిట్లను అందిస్తున్న ఇన్‌స్టామార్ట్‌కు, ఈ భాగస్వామ్యం మరింత బలాన్ని చేకూర్చే అవకాశం ఉంది. 10 కిలోల సిలిండర్, 5 కిలోల సిలిండర్ కావాలంటే.. స్విగ్గీ ఇన్ స్టా మార్ట్ యాప్ లో బుక్ చేసుకోవచ్చు.




# కేజీఎఫ్ డైరెక్టర్ హార్రర్ సినిమా.. 418 రిలీజ్ టైం ఫిక్స్

మూవీ లవర్స్‌కు కమర్షియల్ ఎంటర్‌టైనర్లను అందించిన బ్యానర్లలో టాప్‌లో ఉంటుంది మైత్రీ మూవీ మేకర్స్. కానీ ఈ వెంచర్‌లో ఇప్పటివరకు హార్రర్ జోనర్‌లో మాత్రం సినిమా రాలేదు. ఈ సారి మైత్రీ మూవీ మేకర్స్ 418 సినిమాతో హార్రర్ జోనర్‌లోకి తొలిసారి ఎంటరైంది. పతంగ్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఇంటర్నెట్, సోషల్ మీడియా పర్సనాలిటీ ప్రీతి పగడాల ఈ మూవీలో లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. చరణ్ లక్కరాజు, సూర్య రాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కీర్తన్ నాదగౌడ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను కేజీఎఫ్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ సమర్పిస్తున్నాడు.వీశీజఱవం తెలుగు హార్రర్ ఫిల్మ్ విడుదల తేదీని ప్రకటించారు. 418 చిత్రాన్ని జులై 31న గ్రాండ్‌గా విడుదలచేస్తున్నట్టు ప్రకటించారు. ముంగురులు తిరిగిన పొడవాటి కురులతో ఉన్న ఓ యువతికూర్చున్న బ్యాక్ లుక్‌ను షేర్ చేయగా.. సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. దినేశ్ దినకరన్, సినిమాటోగ్రఫర్‌గా పనిచేస్తున్న ఈ చిత్రానికి వెంకీ జీజీ మ్యూజిక్ కంపోజర్‌గా వ్యవహరిస్తున్నాడు.




# అనుభూతినిచ్చే థ్రిల్లర్

‘అనగనగా’ విజయం తర్వాత ఈటీవీ విన్ సంస్థలో సుమంత్ చేసిన సినిమా ‘న్యూటన్స్ థర్డ్ లా’. రాజేశ్ కర్ణ దర్శకుడు. కె.హరీశ్ నిర్మాత. ఈ నెల 31న సినిమా థియేటర్లలో విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈ సినిమా సాంగ్ లాంచ్ ఈవెంట్‌ని నిర్వహించారు. ‘థమ్ థమ్..’ అంటూ సాగే ఈ పాటను కృష్ణచైతన్య రాయగా, సింజిత్ యర్రమల్లి స్వరపరిచారు. సుమంత్ మాట్లాడుతూ ‘ప్రేక్షకులకు కొత్త అనుభూతినిచ్చే థ్రిల్లర్ ఇది. ఈ స్క్రిప్ట్ విన్న వెంటనే ఇందులోని వినయ్, కార్తీక్ పాత్రలు బలంగా ఉండాలని చెప్పా. ఆ పాత్రలు బావుంటే సినిమా బావుంటుంది. ఇప్పుడు విడుదలైన పాట కూడా ఆ పాత్రలపై చిత్రీకరించినదే. ఈ సినిమాలో ప్రతి పాత్రకూ ప్రాధాన్యత ఉంటుంది’ అని తెలిపారు. థ్రిల్లర్ జానర్ గురించి ఎవరు మాట్లాడుకున్నా, ఈ సినిమా పేరు మాత్రం తప్పకుండా ప్రస్తావనకు వస్తుందని దర్శకుడు రాజేశ్ కర్ణ నమ్మకంగా చెప్పారు. ఇంకా కె.హరీశ్, వేదవ్యాస్, గౌతమ్, త్రినాథ్‌లతోపాటు ఈటీవీవిన్ ప్రతినిధి సాయికృష్ణ కూడా మాట్లాడారు.

# భగవంతుడికీ భక్తుడికీ జరిగే కథ



‘ఇది ఒక మంచి ఫ్యామిలీ సబ్జెక్ట్. ఒక భక్తుడికీ, భగవంతుడికీ మధ్య జరిగే కథ ఇది. దేవుడు దిగిరావాలంటే భక్తి ఎంత ముఖ్యమో ఈ సినిమా చెబుతుంది. ఈసినిమాకు అసలు హీరో వెంకటేశ్వరస్వామి. ఆ పాత్రను రాజేంద్రప్రసాద్ అద్భుతంగా పోషించారు. ఇందులోని ప్రతి పాత్రనూ, ప్రతి పంచ్‌నూ ఆడియన్స్ ఎంజాయ్ చేస్తున్నారు’ అని నటుడు శ్రీకాంత్ అన్నారు. ఆయన, లయ జంటగా నటించిన కామెడీ ఎంటర్‌టైనర్ ‘మిస్టర్ మిడిల్ క్లాస్’. డా.రాజేంద్రప్రసాద్ కీలకపాత్ర పోషించారు. జి.నాగేశ్వర్‌రెడ్డి దర్శకుడు. చందు నిర్మాత. ఇటీవలే సినిమా విడుదలైంది. ఈ సినిమా సక్సెస్‌మీట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. రోజురోజుకీ ఆదరణ పెరుగుతున్నదని దర్శకుడు జి.నాగేశ్వరరెడ్డి చెప్పారు. ఆదరిస్తున్న ప్రేక్షకులకు నిర్మాత చందు ధన్యవాదాలు తెలిపారు. ఇంకా సంగీత దర్శకుడు సాయికార్తీక్, డీవోపీ అంజి, మురళీగౌడ్ కూడా మాట్లాడారు.



# ఇష్టమంటేనే ఇంత కష్టమా..

శ్రీవిష్ణు, మహిమా నంబియార్ జంటగా నటిస్తున్న పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘కామ్రేడ్ కళ్యాణ్’. జానకిరామ్ మారెళ్ల దర్శకుడు. వెంకటకృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మాతలు. కోన వెంకట్ సమర్పకుడు. సినిమా నిర్మాణ దశలో ఉన్నది. ప్రమోషన్స్‌లో భాగంగా ఈసినిమా నుంచి రెండో పాటను మేకర్స్ విడుదల చేశారు. ‘ఇంత ఇష్టమా.. ఇంత ఇష్టమా.. పొంగిపోతున్నా ఈ ఒక్కమాటకీ.. ఇష్టమంటేనే ఇంత కష్టమా.. లొంగిపోతున్నా నీ పిచ్చిప్రేమకీ..’ అంటూ సాగే ఈ లవ్ మెలోడీని భాస్కరభట్ల రవికుమార్ రాయగా, విజయ్ బుల్గానిన్ స్వరపరిచారు. రామ్ మిర్యాల, లిప్సిక ఆలపించారు. హీరోలోని నిస్వార్థమైన ప్రేమకు మెస్మరైజ్ అయిన హీరోయిన్ భావోద్వేగానికి లోనవుతూ పాడిన పాట ఇదని సాహిత్యం వింటే అర్థమవుతున్నది. ఈపాటలో శ్రీవిష్ణు, మహిమా నంబియార్‌ల కెమిస్ట్రీ యువతను ఆకట్టుకుంటుందని మేకర్స్ చెబుతున్నారు. 1992 నాటి ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంత నేపథ్య కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రాధిక శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సాయిశ్రీరామ్, నిర్మాణం: స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పీ.

# ఆ హీరోతో అనుపమ విడిపోయిందా? మరేంటి ఇది

సినిమా ఇండస్ట్రీలో ప్రేమ, డేటింగ్, పెళ్లి, బ్రేకప్, విడాకులు లాంటి మాటలు ఎక్కువగా వినిపిస్తుంటాయి. హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ గురించి కొన్నాళ్ల క్రితం ప్రేమ వార్తలు వైరల్ అయ్యాయి. తమిళ హీరో ధ్రువ్ విక్రమ్‌తో డేటింగ్ చేస్తుందనే టాక్ వినిపించింది. కానీ ఇప్పుడు అతడికి బ్రేకప్ చెప్పేసిందా అని సందేహం కలుగుతోంది. అనుపమ పెట్టిన తాజా పోస్ట్ దీనికి కారణం. స్వతహాగా మలయాళీ అయినప్పటికీ తెలుగులోనూ మంచి క్రేజ్ తెచ్చుకున్న అనుపమ.. తమిళంలోనూ పలు మూవీస్ చేసింది. అయితే ‘బైసన్’ చేస్తున్న టైంలో హీరోహీరోయిన్లు అయిన ధ్రువ్ విక్రమ్, అనుపమ మధ్య నిజ జీవితంలో ప్రేమ పుట్టిందనే టాక్ బయటకు వచ్చింది. అందుకు తగ్గట్లే కొన్ని వ్యక్తిగత ఫొటోలు కూడా సోషల్ మీడియాలో కనిపించాయి. అయితే ఇది నిజమా కాదా అనే సంగతి పక్కనబెడితే లేటెస్ట్‌గా అనుపమ.. బ్రేకప్ తర్వాత తనకు స్వాతంత్ర్యం వచ్చిందనే అర్థం వచ్చేలా ఓ క్యాప్షన్ పెట్టింది. ఫొటోలు పోస్ట్ చేసినందుకు సారీ చెబుతూ.. ఇది పెట్టేముందు ఎవరి అనుమతి అడగాల్సిన అవసరం లేకపోయిందని, వీటికి బ్యాక్ గ్రౌండ్ సాంగ్ సెలక్షన్ కోసం, ఇంకెవరో క్యాప్షన్ పెడతారని ఎదురుచూడటం లాంటివేం లేవని అనుపమ క్యాప్షన్ పెట్టింది. ఇక మరో పోస్టులో.. ఈ రోజు ప్రశాంతత నన్ను చేరుకుంది. ఒకప్పుడు నాదేనని మరిచిపోయిన జీవితాన్ని మరోసారి ప్రేమించడం ప్రారంభించా. మీ అందరినీ నేను ఎంతో ప్రేమిస్తున్నా. ఇకపై నా జీవితం పూర్తిగా నాదే అని రాసుకొచ్చింది. దీంతో అనుపమ బ్రేకప్ రూమర్స్ నిజమేనా అని మాట్లాడుకుంటున్నారు. అనుపమ సినిమాల విషయానికొస్తే.. ఈ మధ్యే ‘మరీచిక’, లాక్ డౌన్ లాంటి సినిమాలతో వచ్చింది గానీ ఫ్లాప్స్ ఎదుర్కొంది. ప్రస్తుతం శర్వానంద్ సరసన ‘భోగి’ మూవీ చేస్తోంది. ఇది ఆగస్టులో థియేటర్లలో రిలీజ్ కానుంది.



EDITOR, PRINTER AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri -515411,Anantapur District Andra Pradesh,Published at #1/111, SC PETA,RAMPAYARRAM PALEM,GOKARAM (V&P),GOKARAM (M), GOKARAM.EAST GODAVARI-533286Andra Pradesh EDITOR B.JAVEED BASHA PRGI. NO : APTEL/26/A4786, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com